కర్నూలు | నంద్యాల

వార్త

7 అక్టోబర్ , 2024 సోమవారం పేజీలు 4


## కార్యకర్తలకు ఎల్లప్పుడు టిడిపి అండ : ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి



**బండిఆత్మకూరు, అక్టోబర్ 6, ప్రభాతవార్త:** కార్యకర్తలకు తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుందని శ్రీశైలం నియోజకవర్గం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి అన్నారు. మండలంలోని కాకనూరు గ్రామానికి చెందిన టిడిపి బూత్ కనీ వ్వనర్ శ్రీనివాసులు గత కొన్ని రోజుల కిందట ప్రమాదవశాత్తు పాముకాటుతో మృతిచెందగా టిడిపి సభ్యత్వం ద్వారా రూ.2 లక్షల భీమా నగదు మంజూరు అయ్యాయి. ఆ నగదును బాధిత కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ సభ్యత్వం తీసుకున్న కార్యకర్తలకు భీమా సదుపాయం కల్పించి వారి కుటుంబాలకు భరోసాగా నిలుస్తుందని ఎమ్మెల్యే బుడ్డా అన్నారు. ప్రతి కార్యకర్త కుటుంబాలకు ఎల్లప్పుడు అండగా ఉంటానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ కార్యకర్తల సేవలు గుర్తించడం, భీమా పథకాల ద్వారా కుటుంబాలను ఆదుకోవడం జరుగుతుందన్నారు. అనంతరం కాకనూరు టిడిపి నాయకుడు సిటికేబుల్ నాగేశ్వర్‌రెడ్డి మనుమరాలు జన్మదిన వేడుకల్లో పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో టిడిపి మండలాధ్యక్షుడు నందిపాటి నరసింహారెడ్డి, లాయర్ కృష్ణారెడ్డి, వెంగల్‌రెడ్డిపేట శ్రీనివాసులు, సాయిబాబారెడ్డి, సేట్ నాగేశ్వర్‌రావు, ఉశేనయ్య, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## రైల్వే ఎస్ఐకు డీజీపీ చేతులమీదుగా.. ప్రశంసా పత్రం అందజేత

- కేసు చేధింపులో ప్రతిభ చూపిన ఎస్ఐ
- అభినందించిన డీజీపీ

**ఆదోనిలీగల్, అక్టోబర్06, ప్రభాతవార్త;** మహిళను కదులుతున్న రైలు నుంచి తోసి వేసిన కేసును చేధించిన బృందంలో ఒకరైన ఆదోని రైలే వ్ ఎస్ఐ గోపాల్ డీజీపీ ద్వారకా తిరుమలరావు చేతులమీదుగా ప్రశంసా పత్రం అందుకున్నారు. గుంతకల్లు రైలే వ్స్టేషన్ పరిధిలోని కదిరి రైలే వ్ స్టేషన్ సమీపంలో వాష్ రూమ్‌కు వెళ్లి వస్తున్న మహిళను ఓ ఆగంతకుడు మెడలో చైన్ లాక్కొని కదులుతున్న రైలు నుంచి తోసేశాడు. ఈ కేసులో నిందితులను చాకచక్యంగా అరెస్టు చేసి సొత్తు స్వాధీనం చేసుకున్న ప్రత్యేక బృందంలో రైలే వ్ ఎస్ఐ సభ్యుడిగా ఉన్నారు. రైలే వ్ ఎస్ఐ గోపాల్ సేవలను డీజీపీ ప్రశంసించారు. పెండింగ్ కేసులను ఎప్పటికప్పుడు చేధించి బాధితులకు అండగా నిలవాలని డీజీపీ




# రోడ్లపై.. వ్యాపారాలు..!

- చోద్యం చూస్తున్న అధికారులు
- ట్రాఫిక్ పోలీసులపై పెరుగుతున్న విమర్శలు
- నగరంలో ట్రాఫిక్ కష్టాలతో బేజారు

**పది నిమిషాలు బైక్ రాంగ్ పార్కింగ్‌లో పెడితే ట్రాఫిక్ పోలీసుల వచ్చేస్తారు... ఫోటోలు తీస్తారు.. ఫైన్ అంటారు.. తప్పితే బైక్‌ను లారీ ఎక్కిస్తారు... కానీ ఉదయం నుంచి సాయంత్రం వరకు ఫుట్‌పాత్‌లు విడిచి రోడ్డుపైనే వ్యాపారాలు చేస్తున్న తోపుడు బండ్లు, చిరు వ్యాపారులను కనీసం ఫుట్‌పాత్ కూడా ఎక్కించలేకున్నారు... ఇలా రోడ్డుపై వ్యాపారం పెడితే ప్రాబ్లం కాదా అని వ్యాపారులను ప్రశ్నిస్తే... ఇవ్వాల్సిన వాళ్ళకి ఇస్తున్నాం.. ప్రాబ్లెమ్ ఎందుకు.. అంటూ ఎదురు ప్రశ్నిస్తున్నారు. ఇందులోని మర్మం ఏమిటో మరి మన ట్రాఫిక్ పోలీసులకు తెలుసా... తెలిసినా బయటకు చెప్పలేని దేవరహస్యమా... లేక పోలీస్ రహస్యమా..**

**కర్నూలు, అక్టోబర్ 05, ప్రభాతవార్త :** రోడ్డుపై వాహనాలు తిరగాలి, ఫుట్‌పాత్‌పై మనుషులు నడవాలి, ఆ తర్వాత చిన్న వ్యాపారాలు, ఆ తర్వాత దుకాణాలు.. ఇది పద్ధతి. కానీ కర్నూలు నగరంలో ఫుట్‌పాత్‌లు దాటి ఏకంగా తారు రోడ్డు మీదకే వచ్చేశారు. తారు రోడ్డుపై వ్యాపారం అంటే ఆశ్చర్యం కలుగుతుంది. కాని దానికి కూడా కొన్ని పద్ధతులు ఉంటాయని, అవి పాటిస్తే ఎలాంటి సమస్య లేకుండా రోడ్డుపై అవసరమనుకుంటే నడిరోడ్డుపై పక్కాగా వ్యాపారం చేసుకోచ్చని తెలుస్తోంది. కర్నూలు నగరంలోకి ప్రవేశించినప్పటి నుండి నగరం బయటకు వెళ్లే వరకు అడుగున ట్రాఫిక్ కష్టాలు అన్నట్లుగా మారిపోయింది. బళ్లారి చౌరస్తా ప్రాంతం ఒక పద్మవ్యూహాన్ని తలపిస్తుంది. అక్కడ ఫ్లైఓవర్ కింద నుండి వాహనం వెళ్లాలంటే మోస్తారు యుద్ధం చేయాల్సిందే. అక్కడి నుండి ముందుకొస్తే ఆర్టీసీ బస్టాండ్. అక్కడ ట్రాఫిక్ కష్టాల గురించి మాట్లాడకూడదు, అంతగా అక్కడి పరిస్థితులు ఉన్నాయి. ఇక ఈద్గా వద్ద ట్రాఫిక్ రోజురోజుకు టైట్ అవుతూనే








ఉంది. ఒక బంగారు పేట వద్ద కొంత పర్వాలేదనిపించినా.. సినిమాలు వదిలే సమయానికి చుక్కలు కనిపిస్తాయి. ఇక మౌర్య ఇన్ సర్కిల్ నుంచి రాజీవిహార్ సర్కిల్ దాటాలంటే కర్నూలు ట్రాఫిక్ వ్యవస్థ పై ఒక తెలియని భావం కలుగుతుంది. ఇక బుధవారంపేట సర్కిల్ నుంచి ట్రాఫిక్ సమస్యలు ప్రారంభమవుతాయి. పెద్ద ఆస్పత్రి కూడలి వద్ద ఆసుపత్రి వైపు రోడ్డు సగం బ్లాక్ అయిపోయి ఉంటుంది. సహకార బ్యాంకు దగ్గర నుండి రోడ్డు కొంత బ్లాక్ అయిపోయింది. అక్కడి నుంచి మొదలైతే, సెంట్రల్ ప్లాజా, గాయిత్రి ఎస్టేట్, మద్దూర్ నగర్, సి క్యాంపు వరకు ట్రాఫిక్ కష్టాలకు ప్రతి ప్రయాణికుడి నోటి నుండి ఒక విధమైన అసంతృప్తితో కూడిన మాటలు బయటకు వస్తూనే ఉంటాయి. తర్వాత మాధవ నగర్ సర్కిల్ అలాగే ఉంటుంది. నంద్యాల చెక్ పోస్ట్ వద్ద పరిస్థితి అంతే.

నగరంలో ప్రయాణం అంటే మహా కష్టంగా మారింది. అందుకు కారణం చిన్న వ్యాపారులు రోడ్లపై రావడం.. కాదు కాదు.. వారిని అనుమతించడం పెద్ద సమస్యగా మారింది. ట్రాఫిక్ పోలీసులు రోడ్లపైకి వచ్చినా ఎందుకు తీయించడం లేదు. ట్రాఫిక్ పోలీసులకు రూల్స్ తెలియవా లేక వాళ్ళు విధులు నిర్వహించడం లేదా..? మరి రోడ్లపైన వ్యాపారాలు ఎందుకు జరుగుతున్నాయి. ఒకటి, రెండు చోట్ల కాదు ప్రతి చోట రోడ్డుపైనే వ్యాపారాలు జరుగుతున్నాయి. బళ్లారి చౌరస్తా మొదలు ప్రతిచోట ఇదే సమస్య ఉంది. ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతంలో ఇరువైపులా రోడ్లపైనే వ్యాపారాలు ఉన్నాయి. అదేమంటే ఎప్పట నుంచో సదరు వ్యాపారాలు సాగుతూనే వాటిని కదిలించ లేమంటారు. ఎప్పటినుంచో రోడ్లపై జరుగుతున్న వ్యాపారాలు కారణంగా ట్రాఫిక్ కష్టాలు వచ్చేస్తున్నాయి. ఈ విషయంలో గతంలో ట్రాఫిక్‌లో పనిచేసిన కొందరు అధికారులు తీవ్ర విమర్శలు మూటగట్టుకున్నారు.

• వివరాలు 2లో

## భారీ వర్షాలకు పొంగిపోర్లుతున్న వేదావతి



**ఆలూరు, అక్టోబర్6, ప్రభాతవార్త:** మండల పరిధిలోని మార్లమడిపి గ్రామం వద్ద వేదావతి నది ఉప్పొంగి పోర్లుతుందని గ్రామస్తులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత రెండు మూడు రోజులుగా ఎడతెరిపిలేని వర్షాలు కురుస్తుండడంతో గుంతకల్, బళ్లారి, అనంతపురం, ఉరవకొండ తదితర ప్రాంతాల్లో భారీ వర్షం కురుస్తుండడంతో వేదావతి నది పై ఉన్న బ్రిడ్జి పై నుంచి నీరు వెలుతుందన్నారు. నది పక్కన ఉన్న ప్రాంత ప్రజలు బ్రిడ్జి పై వెళ్లేటప్పుడు జాగ్రత్తగా వెళ్లాలని సూచించారు.

## నేడు పిజిఆర్ఎస్ ద్వారా ప్రజా విజ్ఞప్తుల స్వీకరణ

**నంద్యాల, అక్టోబరు 6,ప్రభాతవార్తప్రతినిధి**

ఈనెల 7వ తేదిన అంటే నేడు సోమవారము నంద్యాల పట్టణం కలెక్టరేట్‌లోని సెంటినరీ హాలుల్లో ప్రజా పిర్యాదుల పరిస్కార వేదిక కార్యక్రమము ద్వారా ప్రజల నుండి అర్జిలు స్వీకరించన్నుట్టు జిలా కలెక్టరు రాజకుమారి అదివారము ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా సమస్యల పరిస్కారానిక ప్రజల నుంచి అర్జిలు స్వీకరించే ప్రక్రియను పబ్లిక గ్రీవెన్సు రెడ్రెస్సల్ (పిజిఆర్‌యస్) ద్వారా చేపట్టనున్నట్లు అమె తెలిపారు. ప్రజల నుంచి పిర్యాదులు స్వీకరించే పబ్లిక ం గ్రీవెన్సు రెడ్రెస్సల సిస్టం కార్యక్రమానికి జిల్లా అదికారులందరూ హాజరు కావాలని కలెక్టరు తెలిపారు. అలాగే జిల్లా కేంద్రంతో మండల నియోజక వర్గ డివిజన్ స్థాయిల్లో కూడా ఈ కార్యక్రమము నిర్వహిస్తున్నట్టు అమె ఒక ప్రకటనలో తెలిపారు.




## సీసా పాతది.. గ్లాసు కొత్తది..!

- మద్యం నూతన విధాన పాలసీ..
- మద్యం దుకాణాల దరఖాస్తుల స్వీకరణకు రెండు రోజులే గడువు..
- ఉమ్మడి జిల్లాలో 204 దుకాణాలకు అనుమతులు..
- కర్నూలు జిల్లాలో 99, నంద్యాల జిల్లాలో 105 దుకాణాలు..
- 11న లాటరీ పద్దతిలో దుకాణాల కేటాయింపు..
- 12న నూతన మద్యం దుకాణాలు ప్రారంభం..
- దుకాణాలు దక్కించుకునేందుకు వ్యాపారుల మధ్య తీవ్ర పోటీ..

**కోసిగి,ప్రభాతవార్త :**



**"కొత్త లిక్కర్ పాలసీ అమలులో భాగంగా ఏపి ప్రభుత్వం ప్రముఖ పాత బ్రాండ్ల మద్యం అందుబాటులోకి తెచ్చె అవకాశం ఉంది.. గత ప్రభుత్వంలో చాలా బ్రాండ్లు కనుమరుగయ్యాయి.. కొత్త కొత్త బ్రాండ్లు అందుబాటులో ఉండేవి.. మద్యం ప్రియులు వాటినేకొనుగోలు చేయాల్సి వచ్చేది.. ఫలితంగా కొంత ఆరోగ్యకర ఇబ్బందులు కూడా ఎదురయ్యాయి.. ఈ బ్రాండ్లన్నీ వైసీపీ నేతలకుచెందినవెనని ఆరోపణలు ఉన్నాయి.. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో కొత్త మద్యం పాలసీని తీసుకురావడంతో పాటు.. అనామక బ్రాండ్లకు స్వస్తి చెప్పి మేలైన మద్యాన్ని చౌకగా అందుబాటులోకి తేవాలని సంకల్పించింది.. ఇందులో భాగంగా క్వార్టర్ బాటిల్ రూ.99కే అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటుంది..దీంతో సీసా పాతది.. గ్లాసు మాత్రం కొత్తదిగా మద్యం ప్రియులు చర్చించుకుంటున్నారు"..**

జిల్లాలో ప్రభుత్వ మద్యం దుకాణాలను రద్దు చేసి వాటి స్థానంలో కొత్తగా ప్రైవేట్ మద్యం దుకాణాల ఏర్పాటుకు ప్రక్రియ ప్రారంభమయింది.. కొత్త దుకాణాల ఏర్పాటుకు దరఖాస్తులను ఈ నెల 1వ తేది నుండే మొదలు పెట్టి 9వ తేది వరకు దరఖాస్తులను స్వీకరించే విధంగా ఏర్పాటు చేసారు.. అంతే కాక ఈ నెల 11న ఉమ్మడి జిల్లా కలెక్టర్ల సమక్షంలో లాటరీ పద్దతిలో తీసి దుకాణాలకు అనుమతి ఇవ్వనున్నారు.. జనాభా ఆధారంగా లైసెన్సు ఫీజులకు నాలుగు విధాలుగా ఎక్సైజ్ శాఖ రూపొందించింది.. 10వేలు మంది లోపు జనాభా ఉన్నప్రాంతాల్లో రూ.50 లక్షలు లైసెన్సు ఫీజుగా చెల్లించాలి..

• వివరాలు 2లో

## సృష్టి ఆది స్వరూపిణి దేవిగా దర్శనం

**: కైలాస వాహనంపై ఉత్సవమూర్తులు**

శ్రీశైలంప్రాజెక్టు,అక్టోబర్06,ప్రభాతవార్త : దసర మహోత్సవాలలో భాగంగా నాల్గవ రోజైన ఆదివారంనాడు ఉదయం అమ్మవారికి ప్రాతకాల పూజలు, విశేషకుంకుమార్చనలు, నవావరణార్చనలు, జపానుష్టానాలు, పారాయణలు, సూర్యనమస్కారములు, చండీహోమం, పంచాక్షరి,భ్రామరి,బాల జపానుష్టానములు, చండీపారాయణ, చతుర్వేదపారాయణలు,కుమారి పూజలు జరిపించబడ్డాయి.అనంతరం రుద్రహోమం, రుద్రయాగాంగజపములు,రు ద్రపారాయణలు జరిపించబడ్డాయి. అదే విధంగా ఈ సాయంకాలం జపములు, పారాయణలు, నవావరణార్చన, కుంకుమార్చన, చండీహోమం జరిపించ బడ్డాయి.రాత్రి 9.00గంటల నుండి కాళరాత్రి పూజ, అమ్మవారి ఆస్థాన సేవ,సువాసినీపూజలు జరిగాయి.

**కుమారిపూజ:** దసర మహోత్సవాలలో భాగంగా ప్రతీరోజు కుమారి పూజలు నిర్వహించడం జరుగుతోంది. ఈ కుమారిపూజలో రెండుసంవత్సరాల నుంచి పదిసంవత్సరాల వయసు ్స ఉన్న బాలికలను పూలు, పండ్లు,నూతన వస్త్రాలను సమర్పించి పూజించడం జరుగుతోంది.కుమారిపూజ నవరాత్రి ఉత్సవాలలో ఒక ముఖ్యమైన సంప్రదాయం.

**కూష్మాండదుర్గ అలంకారంలో అమ్మవారు:** ఈ నవరాత్రి మహోత్సవాలలో చేయబడుతున్న నవదుర్గ అలంకారంలో భాగంగా శ్రీఅమ్మవారి ఉత్సవమూర్తిని కూష్మాండదుర్గ స్వరూపంలో అలంకరింపజేయడం జరిగింది.నవదుర్గలలో నాల్గవ రూపమైన ఈ దేవి ఎనిమిది భుజాలు కలిగి ఉంటుంది.అందుకే ఈమెను అష్టభుజాదేవి అని కూడా పిలుస్తారు.సృష్టి లేకుండా ఈ జగత్తంతా చీకటిమయంగా ఉన్నప్పుడు,ఈ కూష్మాండదుర్గ బ్రహ్మాండాన్ని సృష్టించింది.ఈ కారణంగా ఈమె సృష్టికి ఆది స్వరూపిణిగా కూడా కీర్తించబడుతోంది. కూష్మాండ దేవిని ఆరాదించడం వల్ల రోగాలన్ని నివారించబడి, ఆరోగ్యం చేకూరుతుంది.ఇంకా అయువు,యశస్సు వృద్ధి చెందుతాయని కూడా చెప్పబడుతోంది.

**కైలాస వాహనంపై ఉత్సవమూర్తులు:** ఈ ఉత్సవాలలో శ్రీస్వామిఅమ్మవార్లకు నిర్వహిస్తున్న వాహనసేవలలో భాగంగా ఆదివారంనాడు కైలాస వాహనసేవ జరిపించబడింది.ఈ వాహనసేవలో శ్రీస్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరిపంజేసి,కైలాస వాహనంపై వేంచేపు చేయించి పూజాదికాలు చేయబడ్డాయి. అనంతరం ఆలయ గంగధర మండపం నుండి గ్రామోత్సవం నిర్వహించడం జరిగింది. శ్రీస్వామి అమ్మవార్ల గ్రామోత్సవంలో పలు జానపద కళారూపాల ప్రదర్శనలు ఏర్పాటు చేయబడ్డాయి.ఇందులో భాగంగా నాధస్వరం,కేరళ చండీ మేళం,కొమ్ముకోయ నృత్యం, ధయ్యం,(సంప్రదాయ నృత్యం)విళక్కు(సంప్రదాయ నృత్యం)స్వాగత నృత్యం, (సంప్రదాయనృత్యం), కోలాటం,రాజభటుల వేషాలు,జానపద పగటి వేషాల ప్రదర్శన,అశ్వ ప్రదర్శన, ఢమురుకం, చిడతలు, శంఖం, అమ్మవారి వేషం,తప్పెట చిందు,డోలు విన్యాసం,వీరభద్ర డోలుకుణిత కన్నడ జాపద కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాదికారి దంతులూరి పెద్దిరాజు దంపతులు, అధికారులు, అర్చకస్వాములు,వేదపండింతులు,భక్తులు,అయా రకాల కళా బృందాలు,పెద్ద సంఖ్యాలో పాల్గోన్నారు.



## దేవరగట్టు బన్ని ఉత్సవం ప్రశాంతంగా జరగాలి - జిల్లా కలెక్టర్

**కర్నూలు, అక్టోబర్ 06, ప్రభాతవార్త :** దేవరగట్టులో జరిగే బన్ని ఉత్సవాన్ని ప్రశాంతంగా నిర్వహించుకోవాలని కలెక్టర్ పీ రంజిత్ బాషా పేర్కొన్నారు.ఆదివారం కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్ లో దేవరగట్టు బన్ని ఉత్సవాల గురించి ఎస్పీ బిందు మాధవ్‌తో కలిసి జిల్లా కలెక్టర్ పాత్రికేయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బన్ని ఉత్సవాలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. శాంతి, భద్రతలకు ఎటువంటి విఘాతం కలగకుండా చూసే బాధ్యత అందరిపై ఉందని పేర్కొన్నారు. మూడు గ్రామాల ప్రజలు ప్రశాంత వాతావరణంలో బన్ని ఉత్సవాలు జరుపుకోవాలని ప్రజలకు సూచిస్తున్నామన్నారు. రేపటినుండి గ్రామాలలో అవగాహన సభలను కూడా ఏర్పాటు చేసి ప్రశాంత వాతావరణంలో బన్ని ఉత్సవాలు జరుపుకునేలా అవగాహన కల్పిస్తామన్నారు. బన్ని ఉత్సవాల సందర్భంగా అధికారులకు డ్యూటీస్ కూడా వేయడం జరిగిందన్నారు. ఉత్సవాలకు వచ్చే ప్రజలకు మౌలిక వసతులు కల్పించే విధంగా చర్యలు చేపడుతున్నామన్నారు. ఎస్పీ బిందు మాధవ్ మాట్లాడుతూ ఈ బన్ని ఉత్సవాల్లో 24 గ్రామాల ప్రజలు పాల్గొంటారని, ఈ గ్రామాలలోని గ్రామ పెద్దలతో కూడా సమావేశం ఏర్పాటు చేశామని వారు కూడా శ్రీమాల మల్లేశ్వర స్వామి పై ఉన్న గౌరవంతో మేము



ఎలాంటి సంఘటనలకు పాల్పడమని తెలియజేశారన్నారు. బన్ని ఉత్సవాలలో గత సంవత్సరం మాదిరిగా బందొబస్తు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం బందొ బస్తు పెంచడం జరుగుతుందన్నారు. ప్రజలు కూడా వారంతకు వారు తెలుసుకొని ప్రశాంత వాతావరణంలో సంబరాలు చేసుకుంటే బాగుంటుందన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం నుండి కంటిన్యూగా పర్యవేక్షణ చేయడం జరుగుతుందన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎలా జరుపుకోవాలి అన్న విషయంపై గ్రామసభలు కూడా నిర్వహించడం జరుగుతుందన్నారు. బన్ని ఉత్సవాల సందర్భంగా డ్రోన్స్ ద్వారా నిఘా ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు లైటింగ్ కూడా గత సంవత్సరాని కంటే ఎక్కువగా ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రజలందరూ సహకరించి ప్రశాంత వాతావరణంలో బన్నీ ఉత్సవాలు జరుపుకోవాలని ఎస్పీ ప్రజలను కోరారు.

## మీనాక్షిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చిన శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరిదేవి

- ఆర్యవైశ్యుల ఆహ్వానం మేరకు ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారిని దర్శించుకున్న మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి
- టంగుటూరు శీనయ్య ఆధ్వర్యంలో మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డికి ఘనస్వాగతం



**బనగానపల్లెరూరల్, అక్టోబర్6, ప్రభాతవార్త:** దేవిశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నాల్గవ రోజు ఆదివారం పట్టణంలోని కొండపేట అమ్మవారిశాలలో వెలసిన శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరిదేవి మీనాక్షిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ మేరకు ప్రపంచ ఆర్యవైశ్య నంద్యాల జిల్లా అధ్యక్షులు, టీడీపీ పార్లమెంట్ వాణిజ్య విభాగం అధ్యక్షులు టంగుటూరు శీనయ్య, శ్రీరామ సుబ్రహ్మణ్యంలతోపాటు ఆర్యవైశ్యుల ఆహ్వానం మేరకు రాష్ట్ర రోడ్లు, భవనాల, మౌలిక సదుపాయాలు మరియు పెట్టుబడులశాఖ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. ముందుగా మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి అక్కడికి చేరుకోగానే టంగుటూరు శీనయ్య ఆధ్వర్యంలో పలువురు ఆర వ్యైశ్య ప్రముఖులు ఆయనకు బాణసంచా పేల్చి పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి ఆలయంలో కొలువుదీరిన మీనాక్షిదేవి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఏటా దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం ఆనందించదగ్గ విషయమన్నారు. ఇందులో ముఖ్యంగా ఆర్యవైశ్యులందరూ ఐకమత్యంతో మెలిగి ఈ పండుగను జరుపుకుంటారన్నారు. అలాగే ఆర్యవైశ్యులు ఐక్యమత ్యంతో ఉండి తమ హక్కులను సాధించుకోవాలన్నారు. ఆర్యవైశ్యులు కేవలం వ్యాపార రంగంలోనే కాకుండా రాజకీయంగా కూడా అభివృద్ధి చెందాలని మంత్రి ఆకాంక్షించారు. అదే విధంగా రానున్న రోజుల్లో ఆర్యవైశ్య సంఘం అభివృద్ధికి తమ వంతు తోడ్పాటునందిస్తామన్నారు. ఆర్యవైశ్యులు తమ కుటుంబ సభ్యులతో సమానమని వారు తమ కుటుంబం పట్ల చూపించే ఆదరాభిమానాలు మరువలేనివన్నారు. అనంతరం మంత్రి బీసీని ఆర్యవైశ్య సంఘం సభ్యులు శాలువ, పూలమాలతో సత్కరించి అమ్మవారి జ్ఞాపికను అందజేశారు. టంగుటూరు శీనయ్య, శ్రీరామ సుబ్రహ్మణ్యం, గాధంశెట్టి వేణుగోపాల్, వేముల రామకృష్ణయ్య, గుండా రవికుమార్, బండారు ప్రకాష్, కాసుల జంగంశెట్టి, శివచంద్రయ్య, గుంత రాము, ప్రియాగ్రాఫిక్స్ రవి, ఆర్యవైశ్యులు, ఆర్యవైశ్య మహిళలు, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు మల్లారెడ్డి, లాయర్ నాగేంద్రారెడ్డి, కోడి నాగేష్‌బాబు, తలారి హరి, యనకండ్ల ఖాదర్, బత్తుల భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఏవిఆర్ ప్రసాదు తండ్రి సుబ్బయ్య మృతికి భూమా అఖిలప్రియనివాళ్ళు

**నంద్యాల,అక్టోబరు 6,ప్రభాతవార్తప్రతినిధి**

నందా ్యల పట్టణానికచెందిన టిడిప రాష్ట్ర కార్యదర్శి భూమి కుటుంబ ముఖ్యఅనుచరుడు ఏవిఆర్ ప్రసాదు తండ్రి సుబ్బయ్య అనారోగ్యముతో మృతి చెండముతో అయన మృతి శాసన సభ్యులరాలు భూమా అఖిలప్రియ నివాళ్ల అర్పించారు.శనివారము ఉదయం సుబ్బయ్య మృతి చెందగా అదివారము సాయంత్రము అయన అంతిమయాత్ర సాగింది. అంతకు ముందు అళ్లగడ్డ ఎంఎల్ఏ భూమి అఖిలప్రియ నంద్యాలకు చేరుకుని అయన పార్థివ దేహమునకు పూలమాల వేపి నివాళ్లు అర్పించారు.ఈసందర్బముగా అమె మాట్లాడుతూ ఏవిఆర్ కుటుంబ సభ్యులనుఏదార్చుతూ మీ కుటుంబానికి భూమా కుటుంబము ఎల్ల వేళల అండగా ఉంటుందని వారిన ఓదార్చారు.



# సీసా పాతది.. గ్లాసు కొత్తది..!

(మొదటి పేజీ తరువాయి ) :

10వేలు దాటి పైబడి 5 లక్షల మంది వరకు ఉన్న చోట్ల రూ.65 లక్షలు, 5 లక్షల మందికి పైగా ఉన్న ప్రాంతాల్లో రూ.85 లక్షలను ఫీజుగా నిర్ణయించారు.. ఈ ఫీజులను ఏడాదిలో ఆరు విడతల్లో చెల్లించే వెసులుబాటును దుకాణాలు పొందిన వ్యాపారులకు కల్పిస్తున్నారు.. కాగా లైసెన్సు ఫీజును ఏటా 10 శాతం పెంచనున్నట్లు తెలుస్తోంది..

**మద్యం విక్రయ దరఖాస్తు రుసుం రూ.2లక్షలు:**
మద్యం విక్రయ దుకాణాల అనుమతి కోసం దరఖాస్తును చేసుకోవాలంటే ఒక్క దరఖాస్తు రుసుం కింద రూ.2 లక్షలు చెల్లించాల్సి ఉంటుంది..ఈ నెల 9వ తేది వరకు దుకాణాల ఏర్పాటు కొరకు ఆసక్తి ఉన్న వారు వారికి సమీపంలో ఉండే ఎక్సైజ్ స్టేషన్‌లలో ఈ దరఖాస్తులను ఆన్‌లైన్,ఆఫ్‌లైన్‌ల విధానంలో రూ. 2 లక్షలు నగదు చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చు.. ఎవరు ఎన్ని దుకాణాలకైనా దరఖాస్తు చేసుకునే వీలు ఉంటుంది.ఆయా స్టేషన్‌ల పరిధిలో వచ్చిన దరఖాస్తులను ఈ నెల 11వ తేదిన కర్నూలు జిల్లా పరిషత్ సమావేశ భవనంలో కలెక్టర్ రంజిత్‌బాష సమక్షంలోఒక్కొ దుకాణానికి లాటరీ తీయనున్నారు.. లాటరీ దక్కించుకున్న వారు ఈ నెల 12వ తేది నుంచే కొత్త దుకాణంలో మద్యం విక్రయించొచ్చు..అయితే ప్రభుత్వం నిర్వహించే టెండర్ విధానం పారదర్శకంగా జరుగుతుందా..అనేది ప్రశ్నార్థకంగా మారింది..ఇప్పటికే కొంతమంది అధికారపార్టీ నేతలతో పాటు వైసీపీ నేతలు కూడా మద్యం దుకాణాలకు పోటీ పడుతున్నట్లు తెలుస్తోంది.. దీంతో సిండికేట్‌గా మారే అవకాశంలేకపోలేదు..ఏప కేంద్రాల్లో..ఏ షాపులోకి ఎవరు టెండర్ వేయాలో ముందే చర్చించుకుని ఆ మేరకే టెండర్లు వేసే అవకాశం ఉన్నట్లుతెలుస్తోంది..ఈ మేరకు ఇప్పటికే పార్టీలకు అతీతంగా నేతలు సిండికేట్‌గా మారి చర్చలు జరుపుతున్నట్లు బహిరంగ రహస్యమే..

**అందుబాటులోకి ప్రముఖ పాత బ్రాండ్లు:** ప్రభుత్వ నూతన విధానంతో గత ప్రభుత్వం మాదిరిగా కాకుండా మంచి బ్రాండ్ ఉన్న మద్యం విక్రయాలు జరుగుతాయని, ముఖ్యంగానాణ్యతా ప్రమాణాలతో ఉన్న మద్యం లభిస్తుందని మద్యపాన ప్రియులు ఆశిస్తున్నారు.. గతంలో రకరకాల పేర్లతో మద్యం సరఫరాకావడం, అవి నాసి రకంగా ఉన్నాయని, మద్యం సేవించే వారి ఆరోగ్యానికి హానికరం అంటూ ప్రచారం కూడా జరిగింది..దీంతో కూటమి ప్రభుత్వంమద్యం ప్రియులకు చౌకగా అందుబాటులోకి ప్రముఖ పాత బ్రాండ ్లను తీసుకొచ్చేందుకు సిద్ధమైంది.. ఈ నేపథ్యంలో క్వార్టర్ బాటిల్ రూ.99కేఅందుబాటులో ఉండనుంది.. అంతేకాక మ్యాన్షన్ హౌస్, ఇంపీరియల్ బ్లూ, మెక్‌డోవెల్ నం.1, స్టెర్లింగ్‌రిజర్వు, బ్లెండర్సుప్రైడ్, రాయల్‌స్టాగ్,మేజిక్ క్షణాలు, సంపూర్ణ వోడ్కా, స్మిర్న్ ఆఫ్, బకార్డిలను తీసుకొస్తున్నటు తెలుస్తోంది.. ఇక బీర్ విషయానికొస్తే కింగ్‌ఫిషర్, నాకౌట్‌అల్ట్రా, స్ట్రాంగ్, ఖజరహో అల్ట్రాస్ట్రాంగ్, బడ్‌వైజర్ అల్ట్రాస్ట్రాంగ్ వంటివి తిరిగి అందుబాటులోకి వస్తాయని మద్యం ప్రియులు ఆశిస్తున్నారు..ఆ మేరకు ధరలు కూడా తగ్గించే అవకాశం ఉంది..

**ప్రభుత్వ రేట్లకే మద్యం విక్రయం:** మద్యం దుకాణాలు దక్కించుకున్న యజమానులు ప్రభుత్వం నిర్ణయించిన రేట్లకే మద్యంను విక్రయించాల్సి ఉంటుంది..ఇకపై అన్ని రకాల బ్రాండ్లుతక్కువ ధరకే దొరకనున్నాయి..ముఖ్యంగా లాటరీలో మద్యం దుకాణాలు దక్కించుకున్న వారిపై అడుగడుగునా నిఘా ఉంచేందుకు ప్రభుత్వంగట్టి ఏర్పాటు చేసింది..ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు కాకుండా నిబంధనలు ఉల్లంఘింగి మద్యం విక్రయిస్తే తక్షణమే చర్యలు తీసుకోవాలనిఅధికారులను ఆదేశించింది.. ప్రతి దుకాణాంలో రెండు సీసీ కెమెరాలు ఏర్పాటును తప్పని సరి చేసింది.. గుడి, బడికి సమీపంలో దుకాణంఏర్పాటు చేసేందుకు అనుమతించరు..దుకాణం దక్కించుకున్న వ్యక్తి మండలంలో నచ్చిన చోట షాపు ఏర్పాటు చేసుకోవచ్చు.. పర్మిట్ రూమ్‌లు,బెల్ట్‌షాపులకు అనుమతి ఇవ్వలేదు.. గుట్టుగా నాణ్యత లేని మందు విక్రయించినట్లు రుజువైనా చర్యలు ప్రభుత్వం చర్యలు తీసుకోనుంది..

# రోడ్లపై.. వ్యాపారాలు..!

**(మొదటి పేజీ తరువాయి ) :** రోడ్లపై వ్యాపారాలు చేసుకునే వారి నుంచి కొందరు పోలీసులు మామూలు తీసుకుంటున్నారని విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. మరి ప్రస్తుతం రోడ్లపై వ్యాపారాలు అనుమతించ డంలో పోలీసుల ఇంట్రెస్ట్ ఏమిటి అనే ప్రశ్న బహిరంగంగా వినిపిస్తుంది.

తాజాగా కలెక్టరేట్ నుంచి సిక్యాంపు వరకు ఇరు వైపులా రోడ్డుపై వ్యాపారాలు విపరీతంగా పెరిగిపోయాయి. పండ్ల దుకాణాలకు అడ్డే లేదు. ఇక టిఫిన్ బండ్లు సాయంత్రం ఆరైందంటే ఫుట్పాత్ పైకి కాదు ఏకంగా రోడ్డుపైకి వచ్చేస్తాయి. టిఫిన్ బండి దగ్గర టిఫిన్ చేయడానికి ఓ నాలుగు వాహనాలు ఆగితే ట్రాఫిక్‌కు ఇబ్బ ంది అవుతుంది. ఇక్కడ ఒక మంచి తమాషా విశేషమేమంటే.. ఆ సమయంలో అటుగా ఎవరైనా పోలీసు వస్తే అక్కడ పార్కు చేసిన బైక్‌లను తీయమంటారే గాని రోడ్డు మీద ఉన్న టిఫిన్ బండిని మాత్రం తీయమన్నారు. అందుకు కారణం సదరు టిఫిన్ బండ్లకు అధికారులకు ముందస్తుగా ఒప్పందాలు జరిగిపోయినట్లు ఉన్నాయి. కొందరు వ్యాపారులకు యూనియన్లు.. యూనియన్ల వెనుక బడా నాయకులు కూడా ఉంటారు. ఎవరు ఉన్న రోడ్డుపై వ్యాపారాలకు అనుమతించమని అడగరు. మహా అయితే ఫుట్‌పాత్ వరకు వ్యాపారాలు అనుమతించమంటారు. కాని ఫుట్‌పాత్ దాటి రోడ్డు పైకి వ్యాపారం రావాలంటే ట్రాఫిక్ పోలీసుల చేతులు తలపాల్సిందే అన్న వాదన బహిరంగంగా వినిపిస్తోంది. ఈ సమస్యకు పరిష్కారం ఉందా అని అంటే అబ్బే.. ఈ పోలీసు వ్యవస్థ ఇంతే అనే పరిస్థితి వచ్చింది. మరి మార్పు...

# లలిత త్రిపురసుందరిగా శ్రీవాసవి కన్యకాపరమేశ్వరిదేవి

**నందికొట్కూరు,అక్టోబర్ 6,ప్రభాతవార్త:**



దేవి శరన్నవరాత్రుల మహోత్సవాలలో భాగంగా నాలుగ రోజు శ్రీవాసవి కన్యకాపరమేశ్వరిదేవి అత్యంత వైభవ అలంకారంలో శ్రీలలిత త్రిపురసుందరిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆదివారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఉదయం అమ్మవారికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం కుంకుమార్చనలు, చిన్నారుల సాంస్కృతి కార్యక్రమాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు వీరబొమ్మ నాగసత్య నారాయణ, గౌరవఅధ్యక్షులు అలువాల రాంమూర్తి, ప్రధాన కార్యదర్శి దిండుకుర్తి నాగేశ్వరరావు, కోశాధికారి జయరాం, అదనపు ప్రధాన కార్యదర్శి బచ్చు శ్రీనువాసులు,వాసవి సేవాదళ్ అధ్యక్షులు గ్రంధి కృష్ణమూర్తి, అవోపా అధ్యక్షులు కల్కి శ్రీనువాసులు, యువజన సంఘం అధ్యక్షులు వీరబొమ్మ శ్రీనువాసులు, వాసవి మహిళా మండలి అధ్యక్షురాలు ఈపూరి నాగకుమారి తదితరులు పాల్గొన్నారు.

# నేడు శనగ విత్తనాలు పంపిణీ



**దేవనకొండ,అక్టోబరు 6,ప్రభాతవార్త :** రబీ సీజన్‌కి సంబంధించి నేడు రైతులకు శనగ విత్తనాలు పంపిణీ చేస్తున్నట్లు టిడిపి మండల కన్వీనర్ విజయభాస్కర్‌గౌడ్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. దేవనకొండ గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో జరిగే శనగ విత్తనాలు పంపిణీ కార్యక్రమానికి ఆలూరు తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ వీరభద్రగౌడ్ హాజరవు తారన్నారు. కావున కార్యక్రమానికి తెదేపా సీనియర్ నాయకులు, కార్యకర్తలు,సర్పంచ్‌లు,ఎంపిటిసిలు,మాజీ సర్పంచ్‌లు,మాజీ ఎంపిటిసిలు, పార్టీ అనుబంధ సంఘాల నాయకులు,జనసేన,బిజెపి నాయకులు తప్పకుండ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

# ఉర్దూ పండిట్ పోస్టులు భర్తీ చేయాలి



**నంద్యాల టెక్కె, 06 అక్టోబర్, ప్రభాతవార్త:**
రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న ఉర్దూ పండిట్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ఆంధ్రప్రదేశ్ ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ (ఏపీయూటీఏ) నాయకులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్ర నాయకులు అబ్దుల్ అజీజ్, జిల్లా ప్రధాన కార్యదర్శి అంజాద్ షరీఫ్‌లు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 238 ఉర్దూ పండిట్ పోస్టులు ఖాళీలు ఉండగా జిల్లాలో 23పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఈ విషయంపై మైనార్టీశాఖ మంత్రి ఎన్ఎండీ. ఫరూక్‌ను కలిసి పోస్టులను భర్తీ చేయాలని కోరామని తెలిపారు. మంత్రి సానుకూలంగా స్పందించి సమస్యను పరిష్కరించాలని సమగ్ర శిక్షణ ప్రాజెక్టు డైరెక్టర్‌కు ఆదేశాలు జారీ చేశారని పోస్టుల భర్తీ కోసం రాష్ట్ర ప్రభుత్వ అనుమతి కోసం సంబంధించిన ఫైలును పంపామని ప్రభుత్వం నుండి అనుమతి రాగానే భర్తీ చేస్తామని ప్రాజెక్టు డైరెక్టర్ వివరించినట్లు వారు తెలిపారు. సమావేశంలో నాయకులు ఫజలుర్ రెహమాన్, ఎండీ.నౌమాన్‌బాషా, ఫయాజ్, హిల్డా సిసొడియ, షబానా, పర్వీన్ తదితరులు పాల్గొన్నారు.

# నిత్యన్నదాన ప్రసాద వితరణకు దాతలు విరాళం

**శ్రీశైలంప్రాజెక్టు,అక్టోబర్06,ప్రభాతవార్త :**



శ్రీశైలం మహాపుణ్యక్షేత్రంలో దేవస్థానం ఆధ్యర్యంలో నిర్వహిస్తున్న నిత్యఅన్నదాన వితరణ పథకంనకు ఆదివారంనాడు ఓంగోలు వాస్తవ్యులు వై.కృష్ణ సుదాకర్ అనుదాత రూ.1,00,126/-ల విరాళమును పర్యవేక్షకు రాలు టి.హిమబిందుకు విరాళం అందజేసిన దాతలకు దేవస్థానం తరుపున దాతకు తగు రశీదు,ప్రసాదాలు,శేషవస్త్రం అందజేసి ఘనంగా సత్కరించారు.

# నవరాత్రోత్సవాలకు పొటెత్తుతున్న భక్తులు

– ఆలయాల దగ్గర సందడే .. సందడి



**కోడుమూరు,అక్టోబర్ 6, ప్రభాతవార్త :** కోడుమూరు పట్టణంలో ఆయా దేవాలయాల్లో వెలిసిన అమ్మవార్ల సన్నిధిలల్లో దసర నవరాత్రోత్సవాలకు భక్తులు పొటెత్తుతున్నారు. తొమ్మిది రోజుల పాటు అమ్మవార్లును భక్త కమిటి నిర్వాహకులు వివిధ రూపాలల్లో ప్రత్యేక అలంకరణలతో అలంకిరిస్తున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు జరిగే నవరాత్రుల ఉత్సవాలకు భక్తులు భారీగా తరలొచ్చి అమ్మవార్లను దర్శించుకుంటున్నారు. పట్టణంలో వెలసిన శ్రీ వాసవీ కన్యాకాపరమేశ్వరీ దేవాలయం,హంద్రీ నదీ ఒడ్డున వెలసిన శ్రీ వల్లెలాంబ దేవి, శ్రీ చౌడేశ్వరీదేవి,తుల్జాభవాని,శ్రీరాముల దేవాయలంలో వెలసిన శ్రీ అంబ భవాని,కాలమ్మదేవి,రాములమ్మ దేవాలయాల్లో అమ్మవార్ల నవరాత్రుల ఉత్సవాలు ఎంతో ఘనంగా సాగుతున్నాయి. ఈ ఉత్సవాలకు వచ్చే భక్తుల తాకిడితో ఆలయాలు కిక్కరిసి పోతున్నాయి. ఆలయాల దగ్గర భక్తులు భక్తి గీతాలు,పల్లకీ సేవా,అర్చనా కార్యక్రమాలతో అలరారుతున్నాయి. ఈ ఉత్సవాలల్లో భాగంగా ఆదివారం శ్రీ లలితా త్రిపుర సుందరి దేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఈ ఉత్సవాలు 12వ తేదిన అమ్మవారు భక్తులకు శ్రీ రాజరాజేశ్వరీ దేవి అలంకారంతో భక్తులకు దర్శనమివ్వనున్నారు. అదే రోజుతో అమ్మవారి ఉత్సవాలు ముగియనున్నాయి. గత ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా అమ్మవార్ల ఉత్సవాలు ఆయా భక్తు కమిటి నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లతో ఉత్సవాల వైభోగాలను భక్తుల ప్రత్యేక ఆకర్శణలతో ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు నిర్వాహుకులు అన్నదాన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

# ప్రభుత్వ నిధులు వెనక్కి ఇవ్వకుండానే సస్పెన్షన్ ఎంఈవోకు పోస్టింగ్..

:-విద్యార్థుల కిట్ల రవాణా భత్యం నిధులు దుర్వినియోగంపై సస్పెండ్..
:-నిధులు చెల్లించకుండానే ప్రొసిడింగ్ ఆర్డర్ జారీ..
:-సస్పెండ్ అయిన కోసిగి ఎంఈవో-2ను చిప్పగిరి ఆర్డర్స్..
:-దుర్వినియోగ నిధులు రికవరి చేయాలని విద్యార్థి సంఘాలు డిమాండ్..

**కోసిగి, అక్టోబరు 6, ప్రభాతవార్త :** ప్రభుత్వం విద్యార్థులకు అందించిన విద్యా సామాగ్రిని ఆయా పాఠశాలలు పంపించేందుకు విడుదల చేసిన విద్యార్థి కిట్ల రవాణాభత్యంను ఉపాధ్యాయులకు చెల్లించకపోవడంతో విచారణ చేసిన జిల్లావిద్యాధికారి ఎంఈవో-2 నాగేశప్పను గత నెలన్నర క్రితం సస్పెండ్ చేసారు.. కాగా ఈ నిధులు ఇంకా చెల్లించకుండానే ఎంఈవో-2 నాగేశప్పకు చిప్పగిరి మండల ఎంఈవో-2గా పోస్టింగ్‌ఇచ్చినట్లు సమాచారం..అయితే దుర్వినియోగం చేసిన నిధులను రికవరి చేయకుండానే ఎలా సెస్పెన్షన్ ఎత్తి వేస్తారని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి..గతంలో కోసిగి మండలంలో ఎంఈవో-2గా విధులు నిర్వర్తిస్తున్న నాగేశప్ప ప్రభుత్వం అందించినరవాణా భత్యాన్ని, ప్రైవేట్ కళాశాల విద్యార్థులు చేసిన సీస్ సర్వే నిధులను వారికి చెల్లించకుండా నిర్లక్ష్యంగా వ్యవరించడంతో పాటుఅవకతవకలకు పాల్పడినట్లు ఆరోపణలు వచ్చాయి.. దీంతో సమగ్ర విచారణ చేసిన జిల్లా విద్యాధికారి శామ్యూల్ నివేధికల ఆధారంగా ఎంఈవో-2ను సెస్పెండ్ చేయడం జరిగింది.. అయినప్పటికి ఉపాధ్యాయులకు రావల్సిన రవాణా భత్యంను ఇంకాఇవ్వకుండా తనవద్దనే ఉంచుకున్నారు..దీనికి తోడు ప్రైవేట్ కళాశాల విద్యార్థులకు అందించాల్సిన మరో నిదులను కూడా వారికిఇవ ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం జరుగుతోంది..రవాణా భత్యం కింద మండలానికి సుమారు రూ.2లక్షల, 26వేల నగదును అందించింది.. అయితే వీటిని అందించే విషయంలో ఉపాధ్యాయులను వేదించడంతో పాటు సర్వే చేసిన విద్యార్థులకుససేమిరా అంటూ కాలం గడపడం జరిగింది.. ఈ నేపథ్యంలో ఆ నిధులను చెల్లించకుండానే ఎంఈవో-2కు సస్పెండ్‌ను ఎత్తివేసిచిప్పగిరి మండలానికి ప్రొసిడింగ్ ఆర్డర్ జారీ చేయడం జరిగినట్లు తెలుస్తోంది..కాగా నిధుల దుర్వినియోగంపై ఆరోపణలుఎదుర్కొంటున్న అధికారికి ఎలా రీ పోస్టింగ్‌లు ఇస్తారని, రవాణా భత్యంను ఇప్పించాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు..

**నిధులు రికవరి చేసి పోస్టింగ్ ఇవ్వాలి: ఎఐఎస్ఎఫ్**
ఉపాధ్యాయులకు రావాల్సిన రవాణా భత ్యం నిధులు, సర్వే చేసిన ప్రైవేట్ కాలేజి విద్యార్థులకు రావాల్సిన నిధులను రికవరిచేస్తేనే ఎంఈవో-2కు పోస్టింగ్ ఇవ్వాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఈరేష్ డిమాండ్ చేసారు..ప్రభుత్వం నుండి విడుదల అయిన నిధులు మొత్తం అవకతవకలు చేయడంతో డీఈవో సస్పెండ్ చేసి ఆ నిదులు తిరిగి చెల్లించకుండానే వేరే మండలానికి పోస్టింగ్ ఇవ్వడం మంచి పద్దతి కాదన్నారు.. దుర్వినియోగం చేసిన నిధులు పూర్తిగా రికవరి చేసుకుని రవాణా భత్యంతో పాటు సీస్ నిధులు అందించేలా చర్యలు తీసుకోవాలి.. లేని పక్షంలో జిల్లా విద్యాధికారి నిర్ణయాన్ని నిరసిస్తూ విద్యార్థులతో కలసి ఆందోళన చేయడంతో పాటు డీఈవో కార్యాలయాన్ని ముట్టడిస్తామని ఈరేష్ హెచ్చరించారు..

# జిల్లాలో మద్యం దుఖాణాలకు ధరఖాస్తులు చేసుకోండి

: జిల్లా ఎక్సైజ్‌శాఖ సూపరిడెంట్ వి.రాముడు
: నాటుసారా బెల్టుషాఫ్‌ల విక్రయాలపై మెరుపు దాడులు చేస్తాం
: ప్రభుత్వం అమలు చేసే మద్యపానం పాలసీని సద్వినియోగం చేసుకోండి
: ఆత్మకూరు సర్కిల్ పరిధిలో 11 మద్యం షాఫ్‌లకు టెండరులు ఆహ్వానం



**ఆత్మకూరు,అక్టోబర్06,ప్రభాతవార్త:** జిల్లాలో ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో ప్రవేట్ మద్యం పాలసీ దుఖాణాలకు దరఖాస్తులు చేసుకోవాలని నంద్యాల జిల్లా ఎక్సైజ్ సూపరిడెంట్ వి.రాముడు తెలిపారు. ఆదివారం పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 113 మద్యం షాప్‌లకు టెండర్లు వేసేందుకు ఎక్సైజ్‌శాఖ ఆహ్వానం పలుకుతుందని అన్నారు. అందులో భాగంగానే ఆత్మకూరు ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో 4 మద్యం దుఖాణాలు, రూరల్ పరిధిలో 2, కొత్తపల్లి మండలం 1, పాములపాడు మండలం 1, శ్రీశైలం మండలం 2, వెలుగోడు మండలం 3 మద్యం దుఖాణాలకు ప్రభుత్వం ప్రవేట్ వ్యక్తులకు కేటాయించే విదంగా ధరఖాస్తులు తీసుకుంటుందని తెలిపారు. మద్యం దరఖాస్తు దారులు రూ.2లక్షలు డిడిలు తీసి పూర్తి వివరాలతో ఎక్సైజ్ కార్యాలయాల వద్ద అందుబాటులో ఉంటాయని తెలిపారు. మొత్తం 11 దుఖాణాలు ఆత్మకూరు ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోనిర్వహించే విదంగా చొరవ తీసుకున్నారని తెలిపారు. జిల్లాలో నాటుసారా అక్రమ బెల్టుషాప్‌లు నియంత్రించే విదంగా మెరుపు దాడులు చేస్తామని అన్నారు. పోలీసుశాఖ, ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో ఎప్పటికప్పుడు నాటుసారా నిర్మూలనపై దాడులు కొనసాగిసు_్తనే ఉన్నామని మీడియా ముందు వెల్లడించారు. ఈ సమావేశంలో ఆత్మకూరు ఎక్సైజ్‌శాఖ సిఐ కిషోర్‌కుమార్, జగదీష్, వీరస్వామి, సిబ్బంది, తదితరులు పాల్గోన్నారు.

# నేడు రైతులకు శనగ విత్తనాలు పంపిణీ



**నంద్యాల టెక్కె, 06 అక్టోబర్, ప్రభాతవార్త:** నంద్యాల మండల పరిధిలోని రైతులకు సోమవారం రాయితీపై పప్పుశనగ విత్తనాలు పంపిణీ చేయనున్నట్లు నంద్యాల మండల వ్యవసాయ అధికారి ఇ.ప్రసాదరావు తెలిపారు. పట్టణంలోని టెక్కె మార్కెట్‌యార్డులో 10గంటలకు ప్రారంభమయ్యే పంపిణీ కార్యక్రమంలో మంత్రి ఎన్ఎండీ.ఫరూక్ చేతుల మీదుగా అందజేయనున్నట్లు ఆయన తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని గుంతనాలు, మిట్నాల, పుసులూరు, పులిమద్ది, భీమవరం, ఊడుమాల్పురం, మూలసాగరం గ్రామాలకు 186క్వింటాళ్ల జేజీ11 రకం శనగ విత్తనాలు కేటాయించడం జరిగిందన్నారు. క్వింటాళుకు 25శాతం సబ్సిడీతో అందజేయనున్నామని ప్రతి రైతుకు ఎకరాకి 2బస్తాల చొప్పున 5ఎకరాలకు 10బస్తాల వరకు ఇవ్వడం జరుగుతుందని విత్తనాలు కావాల్సిన రైతులు తమ పేర్లను రైతు సేవాకేంద్రంలో నమోదు చేయించుకోవాలని ఏఓ ప్రసాదరావు తెలిపారు.

# మినరల్ వాటర్ ప్లాంట్ పున:ప్రారంభం

**కొలిమిగుండ్ల, అక్టోబర్6, ప్రభాతవార్త:**



కొలిమిగుండ్ల మండల కేంద్రంలోని దస్తగిరిస్వామి దగ్గర ఉన్న మినరల్ వాటర్ ప్లాంట్‌కు గత కొద్ది రోజుల కిందట అధికారులు తాళంవేసిన విషయం విదితమే. తాళంవేసిన ప్లాంట్‌ను అధికారులు చొరవ తీసుకుని తలారి శ్రీనివాసులు అనే వ్యక్తికి నిర్వహణ బాధ్యతలు అప్పజెబుతూ ఆదివారం సాయంత్రం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉలువల నరసింహుడు, డిష్ గోపాల్, బిజ్జం భాస్కర్‌రెడ్డి, గూడూరు నాగేశ్వరరెడ్డి, ఉలువల ప్రసాద్, తలారి రమణ మరియు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రహదారికి మరమ్మతులు చేయించండి

– అరికెర రోడ్డులో నిరసన తెలియజేసిన ప్రజలు

**ఆలూరు రూరల్, అక్టోబర్6, ప్రభాతవార్త:**



కురుస్తున్న భారీ వర్షాలకు అరికెర రోడ్డు అధ్వాన్నంగా మారిందని దీంతో ప్రజలు చాలా ఇబ్బందులకు గురవుతున్నారని అధికారులు మరమ్మతులు చేపట్టాలని కోరుతూ ఆదివారం ప్రజలు నిరసన తెలియజేశారు. రోడ్డు పై గుంతలు ఏర్పడి మురుగు నీరు నిలువ ఉండడంతో పట్టించుకునే నాధుడేలేరని వారు విమర్శించారు. దీంతో ఇటు ప్రజలు అటు వ్యాపారస్థులు ఇబ్బందులకు గురవుతున్నారు. మరోవైపు ఈనెల దేవరగట్టు ఉత్సవాలు ఆరంభం కావడం భక్తులు ఎక్కువగా ఇదే మార్గం గుండా వెళ్లవలసి ఉందని వెంటనే అధికారులు మరమ్మతులు చేయించాలని ఉద్యోగ జేఏసీ నాయకులు మహమ్మద్ రఫి కోరారు.

# మద్యం షాపుకు 60లక్షల రూపాయల డిపాజిట్ చెల్లించాలి

**ప్యాపిలి అక్టోబరు6 (ప్రభాతవార్త):**



డోన్ నియోజకవర్గానికి సంబంధించి 16 మద్యం షాపులు వచ్చాయని, మద్యం షాపుకు 65లక్షల రూపాయలను డిపాజిట్‌గా చెల్లించాల్సి ఉంటుందని ఎక్సైజ్ సిఐ వరలక్ష్మి తెలిపారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ టెండర్ల ద్వార ప్రభుత్వం మద్యం షాపులను కేటాయిస్తుందని పేర్కొన్నారు. డోన్‌కు ఆరు మద్యం షాపులు, బేతంచెర్లకు ఏడు షాపులు, ప్యాపిలికి మూడు షాపులను కేటాయించారని వివరించారు. డోన్ పట్టణానికి నాలుగు షాపులు, రూరల్‌లో రెండు షాపులు, బేతంచెర్ల పట్టణానికి నాలుగు, రూరల్ ప్రాంతాలకు మూడు, ప్యాపిలికి మూడు షాపులను కేటాయించారని తెలిపారు. ఒక్క వ్యక్తి ఎన్నిషాపులకైనా టెండర్ వేయవచ్చని పేర్కొన్నారు. టెండర్లలో షాపును దక్కించుకున్న వారు ఆరు విడతలలో డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందని, రెండవ విడతలో బ్యాంకు గ్యారంటిని ఇవ్వాలని, ఈ నెల 9న టెండర్ ఫారాలు స్వీకరిస్తామని, 11న కలెక్టరు కార్యాలయంలో టెండరును లాటరీ తీస్తారని, ఎవ్వరికి వస్తే వారికిషాపు కేటాయిస్తారని తెలిపారు. కలెక్టరు కార్యాలయానికి టెండర్లు వేసిన ప్రతి ఒక్కరు హజరు కావాలని, టెండర్ వేసే వారు అప్లికేషన్ పీజు కింద రెండు లక్షల రూపాయలను చెల్లించాల్సి ఉంటుందని, గడువు చివరి వరకు ఉండకుండ ముందుగానే ఆన్‌లైన్‌లో ధరఖాస్తులు చేసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో ప్యాపిలి ఎస్సై మధుసూధన్‌రావు పాల్గొన్నారు.

# ఒక వ్యక్తి ఎక్కడైనా, ఎన్ని దుకాణాలకైనా దరఖాస్తు చేసుకోవచ్చు

: మద్యం విధానంలో దేశంలోనే మంచి పాలసీ
: నంద్యాల ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ అధికారి రవికుమార్



**నందికొట్కూరుటౌన్, అక్టోబర్ 6, ప్రభాతవార్త :**
రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న నూతన మద్యం విధానం దేశంలోనే మంచి పాలసీ అని నంద్యాల ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ అధికారి రవికుమార్ తెలిపారు. మద్యం దుకాణాల దరఖాస్తుల ప్రక్రియను పరిశీలించేందుకు ఆదివారం స్థానిక ఎక్సైజ్ స్టేషన్‌ను రవికుమార్ వచ్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇంతకు ముందు కేవలం ఒక వ్యక్తి ఒక్క అప్లికేషన్ మాత్రమే అందజేయాల్సి ఉండేదని, ఒక వ్యక్తికి ఒక లైసెన్స్ మాత్రమే ఇచ్చే వారమన్నారు. అయితే ఇపుడు వచ్చిన నూతన మద్యం విధానంలో ఒక వ్యక్తి ఎక్కడైనా ఎన్ని దుకాణాలకైనా, ఎన్ని దరఖాస్తులైనా చేసుకోవచ్చని, అన్నింటికీ అతను లక్కీడ్రాలో అర్హుడన్నారు. ఒక వ్యక్తి ఎన్ని చోట్ల దరఖాస్తు చేసుకున్నా లక్కీ డ్రాకు అతని ప్రతినిధులను అన్ని చోట్లకు పంపవచ్చన్నారు. గతంలో కేవలం ఆఫ్‌లైన్ విధానంలోనే స్టేషన్లలోనే దరఖాస్తులు స్వీకరించేవారమని, నేడు మారుతున్న కాలానుగుణంగా ఎవరి ప్రమేయం లేకుండా, ఎవరి ఒత్తిడులు లేకుండా ఈ బిడ్డింగ్‌లో ఎక్కడి నుంచి అయినా దరఖాస్తు చేసుకునే విధంగా ఈ ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. స్టేషన్ వరకు రాకున్నా ఇంట్లో కూర్చుని మద్యం దుకాణాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకునే వీలు కల్పించారన్నారు. ఆన్‌లైన్, హైబ్రీడ్, డీడీ పద్ధతిన దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆన్‌లైన్‌లో వెబ్‌సైట్‌లో చాలా సింపుల్‌గా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ప్రతి దరఖాస్తుకు రూ.2లక్షలు చెల్లించాలన్నారు. దుకాణాలు దక్కించుకున్న వ్యాపారులకు ఏ రాష్ట్రంలో లేని విధంగా చేసిన వ్యాపారంలో 20శాతం కమీషన్‌ను ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ పాలసీలో గొప్పదనం ఏమిటంటే ఎవరైతే మద్యం అధికంగా తాగే వారికి మద్యం తాగడం తగ్గించేందుకు ప్రత్యేకంగా బడ్జెట్‌లో ఈ మొత్తంలోనే కేటాయించడం జరిగిందన్నారు. అంతేకాకుండా భారీ ఎత్తున మద్యనిషేధం కోసం మద్యం తాగడం ఒక చెడు వ్యసనం అనే ఉద్ధేశం కోసం ఒక ఉద్యమంలా ప్రజలకు అవగాహన కల్పించేలా ఈ పాలసీలో పొందుపరిచారన్నారు. నంద్యాల పరిధిలోని ఏడు ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో 105 మద్యం దుకాణాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు. కొన్ని దుకాణాలకు రూ.55లక్షలు, మరికొన్ని దుకాణాలకు రూ.65లక్షలు లైసెన్స్ ఫీజులు కేటాయించామన్నారు. లాటరీలో దుకాణాలు దక్కించుకున్న వారు వెంటనే లైసెన్స్ ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ సమావేశంలో సీఐ రామాంజనేయులు, ఎస్ఐ జఫ్రుల్లా, ఎస్‌బిఐ ఉద్యోగి ఆనంద్ కుమార్, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా వడ్డె ఓబన్న 178వ వర్ధంతి

**హొళగుంద, అక్టోబర్6, ప్రభాతవార్త:**



ఘనంగా వడ్డె ఓబన్న 178వ వర్ధంతి మండల పరిధిలోని వందవాగిలి గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా వడ్డె ఓబన్న చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మండల వడ్డె సంఘం ఉపాధ్యక్షులు వడ్డె మారెన్న మాట్లాడుతూ ఓబన్న జనవరి 11వ తేది రేనాటి ప్రాంతంలో జన్మించారన్నారు. ఓబన్న సంచార జాతి వడ్డెర కులానికి చెందినవారని, బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీ ఆధీనంలో ఉన్న సమయంలో రేనాటి పాలేగాళ్లకు మరియు కంపెనీకి సవర్‌జీ అధికారాన్ని కుంచానికి ఇచ్చినందుకు పాలేగాళ్లకు ఇచ్చే భత్యం అన్నారు. ఈ విషయంలో ప్రారంభమైన ఘర్షణలు క్రమేపి సాయుధ పోరాటాలుగా మారాయన్నారు. ఈ పోరాటాల్లో ముఖ్యమైనది నొస్సం పాలేగాడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి చేసిన సాయుధపోరు అన్నారు. ఈ ధిక్కార పోరులో సైన్యాధ్యక్షులుగా వడ్డె ఓబన్న పోషించిన వీరోచిత పాత్రను చరిత్రలో తక్కువ వేయడం అత్యంత దురదృష్టకరమన్నారు. భయం ఎరుగని వడ్డెరులు, బోయలు మరియు చెంచులతో కూడిన సంచార తెగల సైన్యాన్ని సమర్ధవంతంగా నడిపించి దట్టమైన నల్లమల అడవుల్లో సైతం కుంచాని సైన్యాన్ని ఊచకోత కోసి ఉరుకులు పెట్టించిన వడ్డె ఓబన్న అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల వడ్డెర సంఘం నాయకులు హనుమంతు, వెంకటేష్, తాయప్ప, మర్రిస్వామి, చిన్న వీరేష్, గోపాల్, కరీబీరా, వడ్డెర కులస్థులు పాల్గొన్నారు.

# అనాధ వృద్ధ మహిళలకు వికలాంగులకు రేషన్ పంపిణీ

**హొళగుంద, అక్టోబర్6, ప్రభాతవార్త:**



మండల కేంద్రమైన హొళగుందలో అనాథ వృద్ధ మహిళలకు, వికలాంగులకు ఆదోనికి చెందిన స్వామి వివేకానంద ట్రస్ట్, హొళగుందకు చెందిన భారత్ యూత్ అసోసియేషన్ సభ్యుల ఆధ్వర్యంలో గత 33 నెలల నుండి అనాథలకు, వృద్ధులకు ఉచితంగా రేషన్ పంపిణీ చేస్తున్నారు. దీంతోపాటు విశాఖపట్టణానికి చెందిన యాగిటి సత్యనారాయణ, గుళ్యంశెట్టి బ్రదర్స్, సత్యనారాయణశెట్టి జ్ఞాపకార్థం నిత్యవసర సరకులతోపాటు విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని పిండివంటలు చేసుకునేందుకు వంట సరుకులు కూడా అందజేశారు. ఈ సందర్భంగా స్వామి వివేకానంద ట్రస్ట్ సభ్యులు, భారత్ యూత్ అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ తమకు తోచిన సహాయం అందిస్తున్నామని ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం వల్ల తమకు ఎంతో సంతోషంగా ఉంటుందన్నారు. మనతోపాటు అనాధలు, వికలాంగులు మంచిగా జీవించాలనే ఉద్దేశ్యంతోనే ఇలాంటి కార్యక్రమాలు చేపడుతున్నామని వారు పేర్కొన్నారు. ఇలాగే గత 33 నెలల నుండి ఇలాంటి కార్యక్రమాలు చేపడుతున్నామని ట్రస్ట్‌కు సహాయ సహకారాలు అందిస్తున్న వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# పెద్దమ్మ తల్లి అన్నపూర్ణాదేవి అలంకారం



**నందవరం, అక్టోబర్ 6, ప్రభాతవార్త:** శరన్నవరాత్రుల్లో నాల్గవరోజు మండలంలోని టి చామలగూడూరు గ్రామంలో పెద్దమ్మవారు అన్నపూర్ణాదేవి రూపంలో దర్శనం ఇచ్చారు. అమ్మవారి విశిష్టత ఆదివారం సమర్పించాల్సిన నైవేద్యం, ధరించాల్సిన రంగు గురించి ఆధ్యాత్మికవేత్త, పచాంగకర్త, గ్రామ పురోహితులు శ్రీధర్ స్వామి తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ భిక్షాందేహి కృపావలంబన కరీ మాతాన్నపూరే ్ణశ్వరీ అని ప్రార్థిస్తు ఆదిపరాశక్తిని అన్నపూర్ణాదేవిగా అలంకరించి ఆరాధించాలని ఆయన తెలిపారు. అన్నం పరబ్రహ్మ స్వరూపం సాక్షాత్ అన్నపూర్ణాదేవి కటాక్షం. ఆ పరమాత్మే ఆది భిక్షువుగా భిక్షణ స్వీకరించినట్లుగా మనకు అనే పురాణ గాధాల ద్వారా తెలుస్తోంది. అన్నం ప్రతి జీవిలోను ప్రాణశక్తికి ఆధారం. అందుకే మనం భోజనం చేసే ముందు ప్రతిసారి అన్నం ఆ భగవంతుని ప్రసాదంగా భావించి కృతజ్ఞత తెలియజేస్తే ఎంతో సంతృప్తిగా స్వీకరించగలు గుతాం. ఏవరికైనా కడుపునిండా భోజనం పెడితే ఆ వ్యక్తి చాల సంతోషంతో ఆకలిగా ఉన్ననాకు అన్నపూర్ణాదేవిగా అన్నం పెట్టావు తల్లి అనడం వింటూ ఉంటాం. భోజనం పరమ అపేక్షతో పెట్టిన వారందరు అన్నపూర్ణలే. ఇంటికి వచ్చిన అథితులకు కానీయండి, భోజనం చేసిన వారి కళ్ళలోని తృప్తిని చూసి మురిసే సంతోషమే అన్నపూర్ణ అని తెలిపారు. జీవకోటికి ప్రాణధారం అయిన అన్నం అన్నపూర్ణాదేవి అధీనం. పరమేశ్వరునికి భిక్షవేసి ఆది భిక్షువుని చేసింది. కనుక మనమందరం ఈరోజున నామహస్తమున అక్షయమైన అన్న పాత్ర దక్షిణ హస్తమున ఒక గరిటతో భక్తులకు ప్రసాది స్తున్న మాతను మనో నేత్రంతో దర్శించుకుంటూ అన్నపూర్ణా అష్టోత్తర నామాలతో అమ్మవారిని పూజించుకొని పునీతులమవుదామన్నారు. ఈరోజునే తల్లులందరు "స్తనవృద్ధి గౌరీ వ్రతం" అని కూడ జరుపుకుంటారు. తల్లులు తమ సంతా నానికి తల్లిపాలకి లోటు రాకుండా అమ్మవారు అనుగ్రహిస్తుందని అపారమైన నమ్మకంతో ఈవ్రతం ఆచరిస్తు జగన్మాతను అన్నపూర్ణాదేవిగా కొలుస్తారని పురాణాల ప్రకారం తెలుతోంది అన్నారు. ఈకార్యక్రమంలో ఆలయ పూజారి తిరుమలరెడ్డి, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## మద్యం దుకాణానికి ధరఖాస్తు చేసుకోండి



**కొత్తపల్లి, అక్టోబర్ 6, ప్రభాతవార్త:** మద్యం దుకాణానికి అసక్తి కలిగిన వ్యక్తులు నిర్భయంగా ధరఖాస్తు చేసుకోవాలని ఆత్మకూరు ఎక్సైజ్ ఎస్ఐ వీరస్వామి, జగదీష్‌లు తెలిపారు. వారు ఆదివారం మండల కేంద్రం కొత్తపల్లిలో విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వం నూతన మద్యం పాలసీ సంబంధించి మద ్యం దుకాణాలకు ధరఖాస్తు స్వీకరించడం జరుగుతుందన్నారు. అందులో భాగంగా కొత్తపల్లికి జనాభా ప్రాతిపదికన ఒక మద్యం షాపు ఉంటుందన్నారు. మద్యంషాపుకు ధరఖాస్తు చేసుకునే వ్యక్తులు తప్పనిసరిగా 21 సంవత ్సరాలు పైబడి ఉండాలన్నారు. ఏదైనా నేరం చేసి శిక్షలు పడి ఉండరాదన్నారు. అసక్తిగల వ్యక్తులు అన్‌లైన్ ద్వారా కానీ, అఫ్‌లైన్ ద్వారా కానీ ధరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అఫ్‌లైన్ ద్వారా ధరఖాస్తు చేసుకునే వ్యక్తులు రూ.2 లక్షలు డిస్ట్రిక్ ప్రొబిషన్ అండ్ ఎక్సైజ్ అఫీసర్ నంద్యాల వారి పేరుపై డిడి తీసి ధరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు ఆత్మకూరు ఎక్సైజ్ స్టేషన్ నందు ధరఖాస్తు చేసుకునేందుకు రెండు కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు. అసక్తి ఉన్నవాళ్లు ధరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

## షుగర్ బీపీ తదితర వ్యాధుల పై అవగాహన

**బనగానపల్లెరూరల్, అక్టోబర్6, ప్రభాతవార్త:** బనగానపల్లె పట్టణంలోని స్థానిక సంజీవరెడ్డి క్లినిక్ నందు షుగర్, బీపీ తదితర వ్యాధుల పట్ల డయాబెటిక్ స్పెషలిస్ట్ డాక్టర్ మల్లికార్జునరెడ్డి ఆదివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ ఇటీవల ప్రజలు జంక్‌ఫుడ్స్ అలవాటుపడ్డారని వాటికి దూరంగా ఉండాలన్నారు. జంక్‌ఫుడ్స్, కల్తీ ఆహార పదార్థాలు ఎక్కువగా తీసుకోవడం వల్ల షుగర్ తదితర వ్యాధులకు గురవుతారని ఆయన తెలిపారు. ప్రతి వ్యాయమం చేయడం వల్ల ఇటువంటి వ్యాధులు రాకుండా అరికట్టవచ్చన్నారు. అలాగే ప్రతిఒక్కరు రోజు రెండు కిలోమీటర్లు నడవడం వల్ల ఆరోగ్యంగా ఉంటారన్నారు. శరీరానికి తగిన శ్రమ ఉన్నప్పుడే రోగాలు దూరమవుతాయని తెలిపారు. అలాగే ప్రతి మూడు నెలలకు ఒకసారి ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం మంచిదని డాక్టర్ మల్లికార్జునరెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో సివిల్ ఇంజనీర్ మగ్బుల్ హుస్సేన్, ఉపాధ్యాయులు సిద్దంరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, రామకృష్ణారెడ్డి, రవి, మహేష్, వేణుగోపాల్, నాగ సంజీవ, శివరాజు, ఖలందర్, మీసేవ మునవర్, మునీరు, ఖాసీం తదితరులు పాల్గొన్నారు.



## బాధిత కుటుంబానికి రూ.3లక్ష రుపాయల చెక్కు అందజేత

**వెల్దుర్తి, అక్టోబర్6, ప్రభాతవార్త**

వెల్దుర్తి పట్టణానికి చెందిన రేపల్లె రాము ఎన్‌హెచ్44లో డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తూ ప్యాపిలి మండలంలో రోడ్డుప్రమాదంలో గత నెలలో మరణించాడు. దీంతో ఎన్‌హెచ్44 కంపెనీ నుంచి రాము కుటుంబానికి వచ్చిన రూ.3లక్షల రుపాయల చెక్కును జిల్లాతెదేపా నాయకులు బొమ్మనశివశంకర్‌రెడ్డి తన స్వగృహంలో ఆదివారం కుటుంబసభ్యులకు అందజేశారు. ఆర్థికసహాయం వచ్చేందుకు కృషి చేసినందుకు కుటుంబసభ్యులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.



## 30 శాతం మధ్యంతర భృతిని వెంటనే చెల్లించాలి

**-ఎస్టీయు జిల్లా అధ్యక్షుడు ఎస్ గోకారి**



**కర్నూలు విద్య, అక్టోబర్ 6, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఉన్న ఉద్యోగుల ఉపాధ్యాయులకు 12వ పిఆర్సీ అమలు అలస్యమవుతున్నందున నిత్యావసర ధరలకు అనుగుణంగా 30 శాతం మధ్యంతర భృతిని వెంటనే చెల్లించాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం ఎస్టీయు జిల్లా అధ్యక్షులు ఎస్ గోకారి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సలాం ఖాన్ ఎస్టీయు భవన్ నందు గోవిందనాయక్ అధ్యక్షతన ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈసందర్భంగా జిల్లా అధ్యక్షుడు ఎస్ గోకారి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాలుగు నెలలు గడిచినప్పటికి ఉద్యోగులు ఉపాధ్యాయులకు మధ్యంతర భృతిపై ఎటువంటి నిర్ణయం ప్రకటించకపోవడం శోచనీయమన్నారు. దసరా కానుకగానైనా ఉద్యోగుల ఉపాధ్యాయులకు 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలన్నారు. ప్రాధమిక విద్యావ్యవస్థను నాశనం చేసే 117 జీఓను రద్దుచేయాలని, పబ్లిక్ పరీక్షా పత్రంలో మార్పులు తీసుకురావాలని డిమాండ్ చేశారు. తల్లికి వందనం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మాత్రమే పరిమితం చేయడం ద్వారా విద్యార్థుల సంఖ్యను పెంచవచ ్చని తెలిపారు. ఉపాధ్యాయులను బోధనకు మాత్రమే పరిమితం చేసి అవసరం లేని యాప్‌లను రద్దుచేయాలని, కేజీబివి ఉపాధ్యాయులకు ఎంటిఎస్ వర్తింపచేయాలని అన్నిమేనేజ్‌మెంట్ ఉపాధ్యాయులకు పదోన్నతులు బదిలీలు వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో దేవదాసు, శేఖర్, మూర్తి జావలి, హుస్సేన్‌మియా, నారాయణ, సుబ్బరాయుడు, ఎల్ల నాగరాజు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర అథ్లెటిక్స్‌లో జిల్లా క్రీడాకారులకు పతకాలు



**కర్నూలు హాస్పిటల్, అక్టోబర్ 6, ప్రభాతవార్త:** రాష్ట్ర అథ్లెటిక్స్‌లో జిల్లా క్రీడాకారులకు పతకాలు ఈనెల 4, 5, 6 తేదిల్లో రాజమండ్రిలోనని స్టేడియంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ మీట్‌లో మన కర్నూలు క్రీడాకారులు 14 పతకాలు సాధించారు. ఈకార్యక్రమంలో అథ్లెటిక్స్ కార్యదర్శి కె సుబ్బారావు మరియు సహాయ కార్యదర్శి ఓబన్న మరియు బిర్లా శ్రీను, అతని అథ్లెటిక్స్ కోచ్ కాశీ రావు పాల్గొన్నారు. మొత ం మీద కర్నూలుకు ఐదు గోల్డ్, ఐదు సిల్వర్, ఐదు బ్రాంచ్ మెడల్స్ సాధించారు. విజేతలను పలువురు క్రీడాసంఘాల నాయకులు వ్యాయామ ఉపాధ్యాయులు అభినందించారు.

## లలితా త్రిపుర సుందరీ దేవిగా అమ్మవారు



**వెల్దుర్తి, అక్టోబర్6, ప్రభాతవార్త :** స్థానిక అమ్మవారిశాలలో ఆదివారం శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరిదేవి అమ్మవారు లలితా త్రిపుర సుందరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. శరన్నవరాత్ర మహోత్స వాల్లో భాగంగా అపధర్మ అధ్యక్షులు సముద్రాల శ్రీరాములు ఆధ్వర్యంలో అమ్మవారికి కుంకుమార్చన, అభిషేకాలు జరిపించారు. సముద్రాల వెంకటేశ్వర్లు, కుమారులు, కొత్తూరు పాండురంగయ్య(క్రిష్ణగిరి) అర్చన సేవాభక్తులుగా ఉండి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు సముద్రాల వెంకటేశ్వర్లు, కుమారులు, సర్విశెట్టి యశ్వంత్(సాయి శంకర్ మెడికల్), కోట్రా భాస్కర్‌శెటిట, కందగడ్ల శకుంతలమ్మ హైదరాబాద్ వారిచే విందును ఏర్పాటుచేశారు. అదేవిధంగా భువనగాయత్రి శక్తిపీఠం ఆలయంలో అమ్మవారు లలిత త్రిపురసుందరీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు బాలక్రిష్ణస్వామి అర్చకత్వమున యజ్ఞం, పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో అపధర్మ అధ్యక్షులు సముద్రాల శ్రీరాములు, తిరివీధి రాంప్రసాద్, వంశీధర్, తిరివీధి నారాయణ శెట్టి, తిరివీధి వెంకటరమేష్, సముద్రాల వెంకటేశ్వర్లు, అత్తులూరి సుబ్రహ్మణ్యం, అత్తులూరి సుధాకర్, టి.వి.కిషోర్, సముద్రాల సురేష్‌బాబు, తిరివీధి వెంకట సుధీంద్ర, ఎ.క్రిష్ణకిరణ్(ఏపి ఆర్యవైశ్య మహాసభయువజనసంఘం జనరల్ సెక్రటరీ), వెల్దుర్తి ఆర్యవైశ్యసంఘం కార్యవర్గ సభ్యులు ఒంగోలు సాయిప్రసాద్, ఎ.కళ్యాణ్, ఐడియా శివ, సంపత్, శ్రీధర్, కోట్రాకాంత్, గోల్డ్‌శేషు, సంతోష్, అమ్మవారిశాల శీను, భువనగాయత్రి శక్తిపీఠం ఆలయ ట్రస్ట్‌బోర్డ్ సభ్యులు జూలకంటి రఘునాథ్‌రెడ్డి, లక్ష్మీసరోజ, జగదీష్, రమణాచారి, హరిసింహానాయుడు, రమణాచలం, హరినాథ్, ఆచారి తదితరులు పాల్గొన్నారు.

## పెద్దమాదన్న పార్టీకి చేసిన సేవలు మరవలేనివి

**క్రిష్ణగిరి, అక్టోబర్6, ప్రభాతవార్త**



కామ్రేడ్ పెద్దమాదన్న సి.పి.ఐ పార్టీకి చేసిన సేవలు మరువలేనివని బోయబొంతిరాళ్ల సర్పంచు రవిమోహన్ అన్నారు. ఆదివారం కామ్రేడ్ పెద్దమాదన్న స్థూపం వద్ద నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సి.పి.ఐ నాయకులు మాట్లాడుతూ పేదలకోసం చేసిన పోరాటాల్లో గాని పార్టీ ఇచ్చిన కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనేవాడన్నారు. బడుగు బలహీన వర్గాల ప్రజల కో సం హక్కుల కోసం పార్టీ తరుపున నిరంతరం పోరాటాలు చేశాడన్నారు. గ్రామంలో శాంతి స్తాపన కోసం చేసిన పోరాటాల్లో బాగస్వాయ్యం వహించాడన్నారు. చదువు కోసం కృషి చేశా దన్నారు. గ్రామానికి రోడ్లు రావడానికి ప్రత్యేక భూమిక పోషించాడన్నారు. ఈ కార్యక్రమంలోమధు, జోలపురం మల్లికార్జున, అనసూయమ్మ, మాదవక్రిష్ణ, కర్రెమాదన్న, కుంటి మాదన్న అల్లి సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

## కోటపాడు గ్రామంలో నేడు వీరభద్రస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ

**కొలిమిగుండ్ల, అక్టోబర్6, ప్రభాతవార్త:** కొలిమిగుండ్ల మండల పరిధిలోని కోటపాడు గ్రామంలో శ్రీ వీరభద్రస్వామి ఆలయంలో గణపతి, నంది, ధ్వజస్తంభ, శిఖర ప్రతిష్ఠ పూజా కార్యక్రమాలు ఈనెల 7,8,9 తేదిల్లో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు గ్రామస్తులు తెలిపారు. 9వ తేది బుధవారం ప్రతిష్ఠ సందర్భంగా మధ్యాహ్నం 12గంటలకు అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహిస్తున ్నట్లు కోటపాడు గ్రామ పెద్దలు తెలియజేశారు.

## కుష్మాండ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చిన శ్రీ చౌడేశ్వరిదేవి



**బనగానపల్లె, అక్టోబర్6, ప్రభాతవార్త:** బనగానపల్లె మండలంలోని నందవరం గ్రామంలో వెలసిన శ్రీ చౌడేశ్వరిదేవి ఆలయం నందు దేవిశరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ మేరకు దేవిశరన్నవరాత్రి ఉత్సవాల్లో నాల్గవ రోజైన ఆదివారం అమ్మవారిని ప్రాత:కాలం నందు మేల్కొపుచేసి అభిషేకం, నిత్యార్చన వంటి విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే యాగశాల నందు ఆలయ వేదపండితులు, అర్చకుల ఆధ్వర్యంలో ఆవాహిత దేవత పూజలు, విశేష పూజా క్రతువులు, చండీపారాయణం, సహస్ర నామార్చన, వేదపారాయణం నిర్వహించారు. ఈ మేరకు దేవిశరన ్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి ఉత్సవమూర్తిని నాల్గవ రోజు కుష్మాండ అలంకారంలో చల్లని దీవెనలను భక్తులను అనుగ్రహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారిణి మరియు ఆలయ అసిస్టెంట్ కమిషన్ జి.కామేశ్వరమ్మ, నందవరం శ్రీ చౌడేశ్వరిదేవి ఆలయ మాజీ చైర్మన్ పి.వి.కుమార్‌రెడ్డి, ఆలయ వేదపండితులు, అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు

## ఘనంగా వడ్డే ఓబన్న వర్ధంతి వేడుకలు

**- వడ్డే ఓబన్న ఆశయాలను సాధిద్దాం....**
**- అఖీల భారత ఒడ్డే ఓబన్న సేవాసమితి నాయకులు**

**గడివేముల, అక్టోబర్06, ప్రభాతవార్త;** నంద్యాల జిల్లా హెడ్ క్వార్టర్‌లో అఖీల భారత ఒడ్డే ఓబన్న సేవాసమితి ఆధ్వర్యంలో రేనాటి వీరుడు, గెరిల్లా యుద్ధ నిపుణుడు, ప్రథమ స్వాతంత్ర్య సమరయోధులు వడ్డే ఓబన్న వర్ధంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు నంద్యాల పట్టణం పొన్నాపురం కాలనీలోని రామాలయంలో అఖీల భారత ఒడ్డే ఓబన్న సేవాసమితి వ్యవస్థాపక అధ్యక్షులు వడ్డే బాలనరసింహుడు, వడ్డెర నాయకుల అధ్యక్షతన ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ బ్లడ్ సెంటర్ వారి ఆధ్వర్యంలో ఉచిత రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. రక్తదానం చేయించడం ద్వారా వడ్డెరులు స్వాతంత్ర్య ఉద్యమాల్లోనే కాకుండా సేవా కార్యక్రమాల్లో కూడా పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. సభ అనంతరం భోజన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వడ్డెర అఖీల భారత వడ్డే ఓబన్న సేవాసమితి నంద్యాల సభ్యులు వడ్డె జనార్ధన్, వడ్డే రాజు, శివకృష్ణ, చిన్న, వల్లెపు శివకృష్ణ, మల్లికార్జున, సురేష్ పాల్గొన్నారు.

## మిత్రమండలి సహకారంతో ఆర్థిక సహాయం

**బనగానపల్లెరూరల్, అక్టోబర్6, ప్రభాతవార్త:** బనగానపల్లె పట్టణంలోని స్థానిక ఎర్రమసీదు కాలనీలో నివాసముంటున్న రామాంజనేయులు ఆరోగ్య పరిస్థితి, ఆర్థిక పరిస్థితి సరిగా లేనందున పంచలింగాల నాగరాజు మిత్రమండలి తరుపున రూ.10వేలు ఆర్ధిక సహాయాన్ని ఆదివారం అందజేశారు. ఈ మేరకు మిత్ర మండలి సభ్యులు మాట్లాడుతూ కర్నూలు జిల్లా ఎంపి బస్తిపాటి నాగరాజుతో కలిసి చదవడం చాలా గర్వంగా ఉందన్నారు. రామాంజనేయులు ఆరోగ్య పరిస్థితి సరిగాలేదని ఎంపి నాగరాజు దృష్టికి తీసుకువెళ్లగా వెంటనే స్పందించిన ఆయన రామాంజనేయులుకు మెరుగైన వైద్యం అందించాలని కోరుతూ రూ.10వేలు ఆర్ధిక సహాయం అందించి ఎంపి ఉదారతను చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో మిత్రమండలి సభ్యులు పుల్లయ్య, ఎం.హరికృష్ణమాచారి, సుబ్బయ్య(తేజ స్టూడియో), అబ్బాస్(పంచాయతీబోర్డు), అమర్, గురు, మోహన్‌రెడ్డి, వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## దురుద్దేశ్యంతో డీలర్‌షిప్‌ను సస్పెండ్ చేశారు

**క్రిష్ణగిరి, అక్టోబర్5, ప్రభాతవార్త :** దురుద్దేశ్యంతో తన డీలర్‌షిప్‌ను సస్పెండ్ చేశారని కోయిలకొండ డీలర్ చెన్నక్రిష్ణ అన్నారు. ఆదివారం మండలకేంద్రంలో పాత్రికేయులతో మాట్లాడుతూ దళితులు రేషన్ బియ్యం వేయ కూడదని కొంత మంది పన్నాగం పన్ని రెవెన్యూ అదికారులకు తప్పుదు పిర్యాదు చేశారన్నారు. రెవెన్యూ అదికారులు షాపును తనీఖీ చెయ్యకుండా నివేదికను ఆర్డీఓకు పంపారన్నారు. గ్రామంలో నివాసం లేదని, బియ్యం సక్రమంగా పంపిణీ చెయ్యడం లేదని, రేషన్‌షాపు తెరువ లేదని పిర్యాదు చేశారు. నిజానిజాలు ఎక్వైరి చేయకుండా సస్పెండ్ చేశారన్నారు. గ్రామంలో కొ ంత మంది దళితుడు అయినందునే దురుద్దేశ్యంతో ఇలా చేశారన్నారు. 22 సంవత్సరాలుగా 1328123 నెంబరు షాపుపై రేషన్ డీలరుగా నిభంధనలకు అనుగుణంగా పనిచేశానన్నారు. నిభంధనలకు అనుగుణంగా రేషన్ డీలరుగా పనిచేస్తున్న నాకు ఉన్నాతాదికారులు న్యాయం చేయాలని ఆయన కోరారు.

## విద్యార్థులకు పాఠశాలలో వృత్తి విద్య అవగాహన

**నందికొట్కూరు, అక్టోబర్ 6, ప్రభాతవార్త:** విద్యార్థులు వృత్తి విద్య శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ప్రధానోపాధ్యాయులు రామచంద్రమూర్తి తెలిపారు. సమగ్ర శిక్ష ఆంధ్రప్రదేశ్ వారు ప్రవేశపెట్టిన ఇంటర్న్ షిప్ శిక్షణలో భాగంగా మండల పరిధిలోని కొణిదేల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు దసరా సెలవుల్లో ప్రతిరోజు వివిధ రకాల వృత్తి విద్యా కోర్సులపై ఒకేషనల్ ట్రైనర్ షకీరా అవగాహన కల్పించారు. అందులో భాగంగా హెల్త్‌కు సంభంధించిన కోర్సులైన నర్సింగ్, ల్యాబ్‌టెక్నిషన్, మెడికల్ స్టోర్స్ అదే విధంగా ఎలక్ట్రికల్ శాఖ, టైలరింగ్‌లో వృత్తి విద్యా కోర్సులపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఉపాధ్యాయులు దేవప్రకాష్, నారాయణరెడ్డి, రఫీఅహ్మద్, సిల్వియా రేచల్, ఫిజికల్ డైరెక్టర్ స్వామిదాసు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## బీసీ రాజారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన పాతపాడు సర్పంచ్ బెడదల మహేశ్వరరెడ్డి



**బనగానపల్లెరూరల్, అక్టోబర్6, ప్రభాతవార్త:** బనగానపల్లె మండలంలోని పాతపాడు గ్రామ సర్పంచ్ బెడదల మహేశ్వరరెడ్డి బనగానపల్లె గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డిని ఆదివారం ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా పాతపాడు సర్పంచ్ బెడదల మహేశ్వరరెడ్డి ఉత్తమ సర్పంచ్ అవార్డుకు ఎంపికయ్యారు. అక్టోబర్ 2వ తేది గాంధీ జయంతి సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజకుమారి, మంత్రి ఫరూక్ చేతుల మీదుగా మహేశ్వరరెడ్డి ఉత్తమ సర్పంచ్ అవార్డును అందుకున్నారు. దీంతో ఉత్తమ సర్పంచ్ అవార్డు అందుకున్నందుకుగాను మహేశ్వరరెడ్డిని బీసీ రాజారెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.

## ఎంబిబిఎస్ సీటు సాధించిన జర్నలిస్టు కుమారుడు ప్రభాస్..

**:- సన్మానించి అభినందనలు తెలిపిన జర్నలిస్టులు**

**పెద్దకడుబూరు, అక్టోబరు 6, ప్రభాతవార్త**

మండల కేంద్రమైన పెద్దకడుబూరు గ్రామానికి చెందిన జర్నలిస్టు జెబి భీమన్న కుమారుడు ప్రభాస్ ఎంబిబిఎస్ సీటు సాధించాడు. ప్రభుత్వ కోటాలో ఎంబిబిఎస్ సీటు ప్రభాస్ సాధించడం పట్ల పెద్దకడుబూరు జర్నలిస్టులు, గ్రామపెద్దలు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం పెద్దకడుబూరులోని స్థానిక ప్రెస్‌క్లబ్ నందు జర్నలిస్టుల సంఘం ఏపియుడబ్ల్యుజె ఆద్వర్యంలో ఎంబిబిఎస్ సీటు సాధించిన ప్రభాస్‌ను శాలువా, బొకే, మొమెంటోలతో అభినంధించారు. ఈ సందర్భంగా జర్నలిస్టు సంఘం మండల అధ్యక్షులు బొగ్గుల సోమన్న, తాలుక ఉపాధ్యక్షులు జె పుల్లయ్య, సహాయ కార్యదర్శి బొగ్గుల ఈరన్న, మండల కార్యదర్శి మంచోది రామన్నలు మాట్లాడుతూ భీమన్న జర్నలిస్టుగా పనిచేస్తూ తన కొడుకును ఎంబిబిఎస్ డాక్టర్‌గా చేయడం అభినందనీయమన్నారు. జర్నలిస్టుల పిల్లలు కూడా ఉన్నత చదువుల్లో సీట్లు సాధించి సమాజంలో రోల్ మోడల్‌గా నిలవాలని వారు కోరారు. మారుమూల గ్రామం నుండి ఎంబిబిఎస్ సీటు సాధించిన ప్రభాస్ భవిష్యత్తులో సొంత గ్రామానికి, పేదప్రజలకు వైద్య సేవలు అందించాలని కోరారు. జర్నలిస్టులు ఎంసి నారాయణ, లింగమూర్తి, రాజు పాల్గొన్నారు.

## గాయత్రీదేవి అలంకరణలో వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు

**- గాయత్రీదేవిని దర్శిస్తే సకల మంత్రసిద్ధి ఫలం లభిస్తుంది**
**- ఆలయ అర్చకులు వసంతలక్ష్మి**

**గడివేముల, అక్టోబర్06, ప్రభాతవార్త;** గాయత్రీదేవిని దర్శిస్తే సకల మంత్రసిద్ధి ఫలితంలభిస్తుందని అమ్మవారిశాల అర్చకులు వసంతలక్ష్మి అన్నారు. మండలకేంద్రమైన గడివేములలో వెలిసిన శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారిశాలలో దసరా శరన్నవరాత్రుల కార్యక్రమాల్లో భాగంగా నాలుగోరోజు ఆశ్రయిజ శుద్ధ చవితి ఆదివారంనాడు వాసవీ మాత గాయత్రీదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా గాయత్రీదేవి కుంకుమార్చన, సుహాసిని పూజ, మహామంగళహారతి, తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. అర్చకులు వసంతలక్ష్మి మాట్లాడుతూ శ్రీశ్రీగాయత్రీదేవి సకల మంత్రాలకు మూలమైన శక్తిగా వేదమాతగా ప్రసిద్ధి పొంది ముక్తా విద్రుమ హేమనీల దవళవర్ణాలతో గాయత్రీదేవి ప్రకాశిస్తుందన్నారు. శిరస్సు యందు బ్రహ్మ, హృదయమందు విష్ణువు, శిఖ యందు రుద్రుడు నివసిస్తుండగా త్రికూర్త్యాంశంగా గాయత్రీదేవి వెలుగందుచుకున్న రూపాన్ని చూసి భక్తులు తరిస్తారని, గాయత్రీదేవిని దర్శించుకుంటే సకల మంత్ర సిద్ధి ఫలం పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు బొంతల మధుసూదన్‌గుప్తా, ఉపాధ్యక్షులు ఆర్.సతీష్‌కుమార్, ఎన్.మల్లికార్జున, కార్యదర్శి సి.వి.రమణయ్య, ఉప కార్యదర్శి సురేష్‌కుమార్, సలహాదారులు బుజ్జయ్య, ఈపూరి పద్మనాభయ్య, శ్రీనివాసులు, కార్యవర్గ సభ్యులు, ఆర్యవైశ్య సోదర సోదరీమణులు, యువతీ యువకులు పాల్గొన్నారు.

## శ్రీపార్వతి దేవి, గాయత్రి దేవిగా అమ్మవారు

**చాగలమర్రి, అక్టోబర్ 6, ప్రభాతవార్త:** దేవీ శరన్నవరాత్రుల ఉత్సవాలలో భాగంగా చాగలమర్రిలో శ్రీగాయత్రీదేవి, ముతాలపాడులో శ్రీపార్వతీదేవిగా అమ్మవారు భక్తులకు ఆదివారం దర్శనమిచ్చారు. ప్రత్యేక రూపాల్లో దర్శన మిచ్చిన అమ్మవార్లకు రుద్రాభిషేకం, నవగ్రహ జపములు, స్వస్థివాచకం, దేవి నవగ్రహ భాగవత పారాయణం తన్మయ సూక్తం దీక్ష హోమం, సుదర్శన మూలమంత్రం హోమం, మంగళ తీంర్థప్రసాదం పూజా కార్యక్రమాలు ఆర్యవైశ్యం సంఘం అధ్యక్షుడు వంకదార లక్ష్మణబాబు ఆధ్వర్యంలో జరిగాయి. అలాగే ముత్యాలపాడు గ్రామంలో అమ్మవారికి ఆలయ కమిటీ అధ్యక్షుడు నరసింహ్మారావు, సుకన్య, బింగుమల్ల రామశేషయ్య, రాజేశ్ర ఆధ్వర్యంలో జరిగాయి. ఈ కార్యక్రమంలో ఆలయకోశాధికారి ముడియం మాధవ, సభ్యులు నవతాప్రసాద్, మల్లికార్జున, బాబు, ముడియం గోపాలక్ష్మి, ముడియం వెంకటరమేష్, మంచికంటి సురేష్‌బాబు, మహిళలు పాల్గొన్నారు.

## అట్టహాసంగా పూర్వపు విద్యార్థుల సమ్మేళనం



**చాగలమర్రి, అక్టోబర్ 6, ప్రభాతవార్త:** స్తానిక పాత ఆర్సి ఎం ఉన్నత పాఠశాల మైదానంలో 1999 సంవత్సరానికి చెందిన పూర్వపు విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం అట్టహాసంగా జరుపుకున్నారు. మంచి చదువులు చదువుకొని కొందరు ఉద్యోగాలలో స్థిరపడగా మరి కొందరు వ్యాపార రంగంలో రాణిస్తూ వివిధ చోట్ల స్థిరపడ్డారు. వీరంత ఒకోచోట చేరడంతో సందడి నెలకొంది. సుమారు 55 మంది ఉపాధ్యాయులతో కలిసి ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఒకే చోట 25 ఏళ్ళ అనంతరం కలువడంతో అప్యాయతగా ఆలింగనం చేసుకొని జీవిత విశేషాలు తెలుపుకుంటూ ఆనందోస్తవంగా గడిపారు. అనంతరం తమ గురువులైన జోజిరెడ్డి బాస్కర్‌రెడ్డి, రాజ్‌కుమార్‌రెడ్డి, మౌలలాలి, చంద్రశేఖర్‌రెడ్డి, ఆంధోళమ్మ, నారాయణమ్మ, బాలస్వామి, చంద్రశేఖం, నాగేంద్రప్రసాద్ లను దుశ్శాలువలు కప్పి పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వపు విద్యార్థులు అన్నపురెడ్డి భాస్కర్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, షబ్బీర్ హామ్మద్, హుస్సేన్‌బాష, నాగరాజు, వెంకటరమణ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆదోని ప్రాంత అభివృద్ధికై ఐక్యంగా పోరాడుదాం

**ఆదోనిలీగల్, అక్టోబర్06, ప్రభాతవార్త;** ఆదోని రెవెన్యూ డివిజన్‌ను జిల్లాగా ప్రకటించాలని, ఆదోని ప్రాంత అభివృద్ధికై ఐక్యంగా ఉద్యమించాలని ఆదోని జిల్లా సాధన కమిటీ కన్వీనర్ పగడాల కోదండ పిలుపునిచ్చారు. ఆదివారం ఆదోని పట్టణంలోని బీసీ ఫెడరేషన్ కార్యాలయంలో ఆదోని జిల్లా సాధన కమిటీ ముఖ్య నాయకుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆదోని జిల్లా సాధన కమిటీ కన్వీనర్ పగడాల కోదండ, గౌరవాధ్యక్షులు దస్తగిరినాయుడు మాట్లాడుతూ అత్యంత వెనుకబడిన రాయలసీమ ప్రాంతమైన ఆదోని రెవెన్యూ డివిజన్‌ను జిల్లాగా ప్రకటించి అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదోనిలో ప్రత్యేక యూనివర్సిటీ ఏర్పాటు చేయాలన్నారు. వేదావతి ప్రాజెక్టును పూర్తి స్థాయిలో అభివృద్ధి కార్యక్రమాలు చేయాలన్నారు. ఆదోని జిల్లా సాధన కమిటీ అన్ని ప్రజా సంఘాల సహకారంతో గతంలో ఉద్యమించినందుకు గత ప్రభుత్వం ఆదోని ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (ఆడా) ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు. కానీ నేటివరకు ఆడా పాలక మండలి ఏర్పాటు చేయకపోవడం దారుణమన్నారు. ఈ ప్రాంతంలో వలసల నివారణ ఉపాధి కల్పన కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆదోని ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ ప్రభుత్వం, అధికారులు నిర్లక్ష్యం చేస్తోందన్నారు. గత ప్రభుత్వం స్థాపించిన ఆదోని మెడికల్ కళాశాల పనులను ప్రారంభించి అతి త్వరలో ప్రజలకు అందుబాటులో తీసుకురావాలన్నారు. ఆదోని, ఎమ్మిగనూరు, పత్తికొండ, ఆలూరు, మంత్రాలయం ప్రాంతాల్లో ప్రధానమైన నీటి సమస్యలు, నూతన ప్రాజెక్టులు పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు రానున్న రోజుల్లో అన్ని ప్రాంతాల్లో అన్ని రాజకీయ పార్టీలకు, ప్రజా సంఘాలను కలుపుకుని ఆదోని జిల్లా సాధనకై ఈ ప్రాంత అభివృద్ధికై రౌండ్ టేబుల్ సమావేశాలు, తద్వారా ఉద్యమాలకు కార్యాచరణ రూపొందిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకులు కె.నాగరాజు, బీయస్పీ పార్టీ నాయకులు రామలింగ, బంగారప్ప, డీఎస్ఎఫ్ నాయకులు ఉదయ్, బీసీ ఫెడరేషన్ నాయకులు షేక్షావలి, బీసీ ప్రజావేదిక నాయకులు రామచంద్ర, ఆదోని జిల్లా సాధన కమిటీ నాయకులు అష్రాఫ్, పాండురంగ, కత్తి రవి, బొజ్జన్న పాల్గొన్నారు.

## హ్యాండ్‌బాల్ శిక్షణ కార్యక్రమం

**చాగలమర్రి, అక్టోబర్ 6, ప్రభాతవార్త:** నంద్యాల జిల్లా సీనియర్ మ్యాన్ హ్యాండ్ బాల్ శిక్షణ పోటీలను ఆదివారం తెలుగుదేశం పార్టీ నాయకులు సమీయుద్దీన్ హుశ్శేన్ వలి, జెట్టి నాగరాజు, జిల్లా పరిషత్ స్కూల్ కమిటీ చైర్మన్ జల్సా గౌస్ ప్రారంభించారు. మూడు రోజుల శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న క్రీడాకారులుఈ నెల 9,10 తేదీలలో జరిగే రాష్ట్రస్థాయి హ్యాండ్ బా పోటీలలో పాల్గొంటారని నంద్యాల జిల్లా కార్యవర్గ సభ్యుడు మహబూబ్‌బాషా తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ సక్రటరీ మహబూబ్‌బాషా, పీడి దాదాపీరా, కోచ్ సురేంద్ర భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

## వనదుర్గ అలంకరణలో శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరిదేవి

**ఆదోనిలీగల్, అక్టోబర్06, ప్రభాతవార్త;**

ఆదోని పట్టణంలోని నగరేశ్వరగుడిలో కొలువైన శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆదివారంనాడు వాసవీదేవి అమ్మవారు వనదుర్గ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో అమ్మవారికి ఉదయం నుంచి విశేష పూజలు నిర్వహించారు. అలాగే ఆదోని పట్టణ ఇలవేల్పు మహాయోగి లక్ష్మమ్మవ్వ వారు కేసరి దాల్ మరియు కొబ్బరి తరుముతో సుందరంగా అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. నవరాత్రి ఉత్సవాల్లో మహిళలు, ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకుంటూ అమ్మవార్లకు పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

# రైతుల కష్టం.. దళారులకి కాసుల వర్షం..!

- అడుగడుగునా దోపిడీకి గురవుతున్న పత్తి రైతులు
- అనుమతులు లేకున్నా మధ్య దళారుల పత్తి వ్యాపారం
- ధర ఎక్కువ ఇస్తామని నమ్మించి మోసం
- తూకాల్లో మోసాలు
- చిత్తు కాగితాల్లోనే బిల్లులు
- చూసిచూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు





**ఎమ్మిగనూరు క్రైం, అక్టోబర్ 06 ప్రభాతవార్త:** ఆరుగాలం కష్టపడి పండించిన రైతు నిలువునా దోపిడీకి గురవుతున్నాడు. దేశానికి పట్టెడన్నం పెట్టే అన్నదాతనే నడ్డీ విరుస్తున్నారు. అడుగడుగునా రైతు కుదేలవుతున్నా కృంగిపోవడం తప్ప ఆదుకునే నాధుడే కరువయ్యారు. ప్రతి ఏటా ప్రకృతి వైపరీత్యాలు రైతు జీవితంతో ఆటలాడుకుంటున్నాయి. ఆదుకోవాల్సిన పాలకులు పట్టించుకోవడం లేదు. పండించిన పంటకు మద్దతు ధర కల్పించాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విత్తనం వేసింది మొదలు పంట చేతికొచ్చేదాకా రైతులను దగా చేస్తున్నారు. పండించిన పంటపై వచ్చే ప్రతిఫలాన్ని రైతులు దక్కించుకోలేకపోతున్నారు. మధ్యదళారులు రైతులను నట్టేట ముంచి వచ్చిన లాభాన్ని దేగల్లా తన్నుకుపోతున్నారు. ఏమార్కెట్‌లో చూసినా ఇదే తంతు. పెట్టిన పెట్టుబడులు కూడా చేతిక రాక తల్లడిల్లుతుంటే, అప్పనంగా వచ్చిన వ్యాపారులు రైతు శ్రమను సొమ్ము చేసుకుంటున్నారు. ఎమ్మిగనూరు నియోజక వర్గంలో పత్తి సాగు ఏటకేటకు పెరుగుతుంది. ఏదో ఒక రోజు భూతల్లి తమను గద్దన వేయకపోతుందా అంటూ నేల తల్లిని నమ్ముకొని పత్తిని సాగు చేసి చేతికొచ్చిన పంటను ఎమ్మిగనూరు పట్టణంలో పుట్టగొడుగుల్లా వెలసిన పత్తి దుకాణాలకు తెస్తే దళారులు రైతుల కంట్లో మట్టి కొట్టి తక్కువ ధరకు పత్తిని కొనుగోలు చేసి వ్యాపారులతో కుమ్మకై దండుకుంటున్నారు. పత్తి వ్యాపారంలో మధ్య దళారులు జోక్యం చేసుకొని రైతుకు మద్దతు ధర దక్కకుండా దోచుకుంటున్నారు దళారులు. ఎమ్మిగనూరు నియోజక వర్గంలో దాదాపు వేల ఏకరాల్లో పత్తి పంటను సాగు చేశారు రైతులు. ఏటా ప్రకృతి వైపరీత్యాల కారణాల వల్ల రైతు పంట దిగుబడి రాక నష్టపోతూనే ఉన్నారు. అయితే ఈసారి సకాలంలో వర్షాలు కురిసి పచ్చని పైర్లతో కళకలలాడుతున్నాయి. రైతులు కూడ పంట దిగుబడి రావడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. అంతేకాకుండా రాష్ట్ర ప్రభుత్వం కూడ పత్తి పంటకు మద్దతు ధర కూడ ప్రకటించింది. దీంతో రైతన్న సంతోషానికి హద్దులు లేకుండా పోయాయి. పంట దిగుబడిని రైతులు మార్కెట్ యార్డుకు తరలించి పత్తిని విక్రయించి మంచి లాభాలను ఆర్జించారు. అయితే కొంతమంది దళారులు చేతుల్లో మోసపోయిన రైతులు కూడ ఉన్నారు. దళారులు నేరుగా గ్రామాలకు వెళ్లి ఆధిక ధరకు పత్తి కోనుగోలు చేస్తామని మాయ మాటలు నమ్మి ఇళ్ల దగ్గరే దళారులకు పత్తి ని విక్రయించారు. దళారులు మాత్రం రైతులకు తక్కువ ధరకు కొనుగోలు చేసి మార్కెట్ యార్డులో ఆధిక ధరలకు పత్తి విక్రయాలు చేసి లాభాన్ని దేగల్లా తన్నుకుపోతున్నారు. ఎమ్మిగనూరు పట్టణంలో పత్తి వ్యాపార దుకాణాలు ఏలాంటి అనుమతులు లేకుండా విచ్చల విడిగా పత్తి వ్యాపారం చేస్తున్నారు. పత్తి వ్యాపారులు ఒక్కొ దుకాణానికి ఒక్కొ దళారిని ఏర్పాటు చేసుకొని గ్రామాల్లో రైతుల దగ్గరకు వెళ్లి ధర ఎక్కువ ఇస్తామని మాయ మాటలు చెప్పి పత్తిని తమ దుకాణాల వైపు తరలిస్తున్నట్లు సమాచారం. దుకాణానికి తీసుకువచ్చిన పత్తిని తూకాల్లో మోసాలకు పాల్పడుతూ తక్కువ క్వింటాలు చూపిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా దళారులు ధర ఎక్కువ ఇప్పిస్తామని చెప్పి ఇక్కడ కనీస మద్దతు ధర కూడ ఇవ్వడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఇలా రైతులను నిలువునా దోపిడి గురిచేస్తున్నారు పత్తి వ్యాపారులు. అంతేకాకుండా రోజుకు లక్షల్లో వ్యాపారం చేస్తూ ఆదాయ పన్ను శాఖకు ఏలాంటి ఆదాయం చెల్లించకుండా జీరోగా వ్యాపారం చేస్తున్నట్లు సమాచారం. రాత్రికి రాత్రే లారీలు పత్తిని దూర ప్రాంతాలకు తరలిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. రైతులకు చిత్తు కాగితాల్లో బిల్లులు వేస్తూ పంట విక్రయించిన సొమ్మును ఇచ్చేందుకు నెలలు తరబడి తమ దుకాణాల చుట్టూ తిప్పుకుంటున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. అనుమతులు లేకుండా ఇష్టా రాజ్యంగా ఏర్పాటు చేసుకొని రైతులను నిలువునా దోపిడీ చేస్తున్న దళారులపై తూకాల్లో మోసాలకు పాల్పడుతున్న వ్యాపార దుకాణాలపై వ్యవసాయ మార్కెట్ యార్డు అధికారులు చర్యలు తీసుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పుట్టగొడుగుల్లా ఏర్పాటు చేసుకున్న పత్తి దుకాణాలపై పూర్తి స్థాయిలో పరిశీలించి అనుమతి లేని దుకాణాలను సీజ్ చేయాలని రైతులు కోరుతున్నారు.

# పారదర్శకంగా ఉచిత ఇసుక

**: అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు**
**- జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా**



**కర్నూలు, అక్టోబర్ 6, ప్రభాతవార్త :** నూతన ఇసుక పాలసీ ప్రకారం ఇసుకను ఉచితంగా, సులభంగా బుక్ చేసుకునేందుకు.. రాష్ట్ర ప్రభుత్వం ఇసుక బుకింగ్ పోర్టల్ ను అమలులోకి తీసుకువచ్చిందని.. ఈ సదుపాయాన్ని జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ పి. రంజిత్ బాషా పేర్కొన్నారు. ఆదివారం కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్ లో ఇసుక అంశం పై ఎస్పీ జి.బిందు మాధవ్ తో కలిసి కలెక్టర్ ప్రెస్ కాన్ఫరెన్స్ నిర్వహించారు.. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో జూలై 8వ తేది నుండి నూతన ఇసుక పాలసీ విధానం ప్రకారం ఇసుకను పంపిణీ చేస్తున్నామన్నారు. ఇసుక పంపిణీ ని సులభతరం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆన్లైన్ లో ఇసుక ను బుక్ చేసుకునే అవకాశం కల్పించిందన్నారు. అదే విధంగా గ్రామ/వార్డ్ సచివాలయాల ద్వారా కూడా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జిల్లాలో 5 డీసిల్టేషన్ పాయింట్స్ ఉన్నాయన్నారు. ఈర్లదిన్నె, కె.సింగవరం, కొత్తకోట, ముడుమాల, పల్లె దిడ్డి అని తెలిపారు.. వీటి నుండి ప్రతి రోజు దాదాపు 6 వేల మెట్రిక్ టన్నుల దాకా ప్రజలకు అందుబాటులో ఉంటుందన్నారు. ఆన్లైన్ బుకింగ్ ప్రతి రోజు మధ్యాహ్నం 12 గంటలకు ఓపెన్ అవుతుందని, ఆన్లైన్ లో 6 వేల మెట్రిక్ టన్నుల దాకా బుక్ చేసుకోవచ్చని కలెక్టర్ సూచించారు. 5 డీసిల్టేషన్ పాయింట్స్ లో లక్ష 73 వేల 598 మెట్రిక్ టన్నుల ఇసుక లభ్యత ఉందని కలెక్టర్ తెలిపారు. అదే విధంగా అక్టోబర్ 16 వ తేది నుండి కౌతాళం మండలంలో మరళిలో మాన్యువల్ రీచ్ ను ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. మార్చి 2025 వరకు ఇంటికి, ఇతర అవసరాలను తీర్చేందుకుగాను 4 ఓపెన్ ఇసుక రీచ్‌లను గుర్తించడం జరిగిందని, వాటికి సంబంధించిన పర్మిషన్ లు, పబ్లిక్ హియరింగ్ లు పెండింగ్ లో ఉన్నాయని, అనుమతులు రాగానే వాటిని కూడా అందుబాటులోకి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ పేర్కొన్నారు.

ఇసుక పూర్తిగా ఉచితమేనని, కేవలం తవ్వకం ఖర్చు, లోడింగ్, ఆపరేషనల్, సీనరేజెస్, జీఎస్టీ తదితర ఖర్చుల కోసం మాత్రమే అమ్మకపు ధరను రూ.320 లుగా నిర్ణయించడం జరిగిందన్నారు. ఇసుక పంపిణీ పర్యవేక్షణకు జిల్లా, మండల స్థాయిలో రెవెన్యూ మైనింగ్ రవాణా పోలీస్ శాఖ తదితర అధికారులతో టాస్క్ ఫోర్స్ టీమ్ లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అదే విధంగా జిల్లాలో టోల్ ఫ్రీ నెంబర్ 1800 425 6042 ను కూడా ఏర్పాటు చేయడం జరిగిందని, ఎక్కడైనా ఇసుక సమస్య ఉన్నట్లయితే ఈ నెంబర్ కి కాల్ చేసి ప్రభుత్వం దృష్టికి తీసుకురావచ్చని కలెక్టర్ తెలిపారు. ప్రతి డిసిల్టేషన్ పాయింట్ వద్ద సిసి కెమెరాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రతి బుకింగ్ కి సంబంధించి ఇన్వాయిస్ ఉంటుందని, క్యూ ఆర్ కోడ్ రూపంలో స్కాన్ చేయడం జరుగుతోందన్నారు.. తద్వారా వెహికిల్‌ను ట్రాక్ చేయవచ్చన్నారు. పోస్ట్ వెరిఫికేషన్‌లో భాగంగా బుకింగ్ జరిగిన వాటిలో కొన్నింటిని ర్యాండమ్ గా వెరిఫికేషన్ చేయిస్తున్నామని, అందులో ట్రాన్స్‌పోర్ట్‌కి సంబంధించి ఏమైనా ఇబ్బందులు కలిగించారా ? ఇసుక క్వాంటిటీలో ఏమైనా తప్పులు జరుగుతున్నాయా అని చెక్ చేయడం జరుగుతోందన్నారు. ప్రజలకు నిజంగా అవసరం ఉంటే దగ్గరలో ఇసుక అందుబాటులో ఉన్నట్లయితే పంచాయతీ సెక్రెటరీ అనుమతితో ఉచితంగా ఇసుకను తీసుకొని వెళ్లవచ్చునని, అంతే గానీ 20, 30 వాహనాల్లో ఇసుకను తీసికెళ్ళి బిజినెస్ చేయకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. అక్రమ రవాణా కు పాల్పడితే చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. పంచలింగాల, నాగులదిన్నె ప్రాంతాల నుండి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న 5 ట్రాక్టర్లను నిన్న సీజ్ చేయడంతో పాటు ఎఫ్ఐఆర్ కూడా బుక్ చేయడం జరిగిందని కలెక్టర్ వివరించారు.

## నేడు నగరపాలకలో వినతుల స్వీకరణ

**కర్నూలు మున్సిపల్, అక్టోబర్ 6, ప్రభాతవార్త:** నగర పాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఇంచార్జీ కమిషనర్ ఆర్‌జివి కృష్ణ ఆదివారం తెలిపారు. నగరపాలక సంబంధించి ఏవైనా స్థానిక సమస్యలుంటే అర్జీలు సమర్పించగలరని ప్రజలను కోరారు. ఉయదం 10 గంటల నుండి నిర్వహించే ఈకార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఇంచార్జీ కమిషనర్ కోరారు.

## రైలు ఢీకొని వ్యక్తి మృతి

**ఆదోనిలీగల్, అక్టోబర్06, ప్రభాతవార్త;**



ఆదోని-ఇస్వీ రైల్వే స్టేషన్‌ల మధ్య డౌన్ లైన్ ట్రాక్ 496/30-497/2 మధ్య టి.చంద్రశేఖర్(50) అనే వ్యక్తి రైల్వే ట్రాక్ దాటుతుండగా రైలు ఢీకొట్టిందని రైల్వే పోలీసులు సాయి శ్రీనివాసరావు ఆదివారం విలేకరులకు తెలిపారు. మృతుడికి చెవులు వినపడవని, మతిస్థిమితం సరిగా లేదని, రైల్వే ట్రాక్ దాటుతుండగా రైలు ఢీకొట్టి వెళ్లిందని చెప్పారు. మృతదేహాన్ని ఆదోని ప్రభుత్వ ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తమై తరలించామన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

## అమ్మ బాబోయ్ కోతులు

**- భయాందోళనకు గురవుతున్న వ్యాపారస్తులు పిల్లల తల్లిదండ్రులు**



**ఆలూరు రూరల్, అక్టోబర్6, ప్రభాతవార్త:** ఆలూరు పట్టణంలో కోతుల బీభత్సానికి ఆలూరు ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ప్రధానంగా మెయిన్ బజారు, కోటవీధి, కోయనగర్ కాలనీవాసులను కోతులు భయాందోళనకు గురిచేస్తున్నాయి. ఇంటి తలుపులు తెరిచి ఉంచాలనుకుంటే భయాందోళనకు గురవుతున్నారు. కోతులు ఇంటిల్లో ప్రవేశించి వస్తువులను చెల్లాచెదురు చేస్తున్నాయని అదికాక దాడులు కూడా చేస్తున్నాయని కాలనీవాసులు వాపోతున్నారు. పండుగపూట వ్యాపారస్తులు వ్యాపారాలు నిర్వహించుకోకుండా దుకాణాల్లో ఉన్న సరుకులను తీసుకువెళ్లడమే కాకుండా వాటిని అడ్డుకోబోయిన యజమానుల పై దాడులు చేస్తున్నాయని కాలనీ ప్రజలు వాపోతునారు. అలాగే పిల్లలు దుకాణాల నుంచి వస్తువులను తీసుకువచ్చేందుకు పంపించాలంటేనే వారి పై ఎక్కడ దాడి చేస్తాయోనని తల్లిదండ్రులు భయాందోళనకు గురవుతున్నారు. కోతులను వెంటనే పట్టుకుని అడవుల్లో వదిలేయాలంటూ కాలనీవాసులు కోరుతున్నారు.

## భానకచర్ల క్రాస్ రెగ్యులేటర్ నుంచి 10 వేల క్యూసెక్కుల నీటి విడుదల



**పాములపాడు, అక్టోబర్ 6, ప్రభాతవార్త:** పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి శ్రీశైలం కుడిగట్టు ప్రధాన కాల్వ ద్వారా భానకచర్ల క్రాస్ రెగ్యులేటర్ వద్దకు 10 వేల క్యూసెక్కుల నీరు వచ్చిచేరుతుంది. అక్కడి నుంచి తెలుగుగంగ కాల్వకు 5 వేల క్యూసెక్కులు, జిఎన్ఎస్ఎస్ కాల్వకు 4 వేల క్యూసెక్కులు, కేసిసి ఎస్కేప్ ఛానల్ కాల్వకు 1000 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలుగుగంగ ఏఈ దేవేంద్ర ఆదివారం తెలిపారు.

# నియోజకవర్గంలో గ్రామ పంచాయతీల అభివృద్ధికి శ్రీకారం

**: రూ.20కోట్లతో సీసీ రోడ్లు నిర్మాణ పనులకు భూమి పూజ**
**: రాష్ట్రంలో ఎన్‌డిఏ ప్రభుత్వం ఏర్పడి 100రోజులోనే నియోజకవర్గానికి కోట్ల నిధులు మంజూరు**
**: తిరుపతి శ్రీవారి లడ్డు కల్తీ విషయంలో సుప్రీం కోర్టు తీర్పును ఆహ్వానిస్తా**
**: శ్రీశైలం నియోజకర్గం ఎంఎల్ఏ బుడ్డా రాజశేఖరరెడ్డి**





**ఆత్మకూరు, అక్టోబర్06, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఎన్‌డిఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అభివృద్ధి, సంక్షేమం, విద్య, వైద్యం అందించే విదంగా ప్రభుత్వం అన్ని విదాలుగా అభివృద్ధిలో ముందుకు వెళ్తామని శ్రీశైలం నియోజకవర్గం ఎంఎల్ఏ బుడ్డా రాజశేఖరరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని కరివేన గ్రామంలో నూతన సీసీరోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. ముందుగా గ్రామ నాయకులు మర్యాద పూర్వకంగా పూలపుష్పాలతో, దుశ్శాలవతో సన్మానించి ఆహ్వానం పలికారు. రూ.2.20కోట్ల నిధులతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంఎల్ఏ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సహకారంతో శ్రీశైలం నియోజకవర్గంలో అన్ని గ్రామ పంచాయతీల అభివృద్ధి పనులకు ఎన్‌డిఏ కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని అన్నారు. ప్రజలకు మౌళిక వసతులు కల్పించే విదంగా కృషి చేస్తామని అన్నారు. రాష్ట్రంలో ఎన్‌డిఏ ప్రభుత్వం ఏర్పడిన వంద రోజులోనే శ్రీశైలం నియోజకవర్గంలో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.20కోట్లు నిధులు మంజూరు చేసిన ఘనత ప్రభుత్వానికే దక్కిందని కొనియడారు. గత వైసిపి ఐదేళ్ళ పరిపాలనలో కనీసం ఒక గ్రామంలోనే అయిన సీసీరోడ్డు వేసిన దాఖలాలు కనిపించలేదని విమర్శించారు. నియోజకవర్గంలో వైసిపి నాయకులు అధికారాని అడ్డుపెట్టుకోని ఇష్టరాజ్యంగా వ్యవహరించిన తీరుపై మండి పడ్డారు. రాష్ట్రాన్ని ఒకవైపు వైసిపి మాజీ ముఖ్యమంత్రి లూటి చేస్తే మరో వైపు నియోజకవర్గంలో ప్రజలను తప్పుదోవ పట్టించే విదంగా అవినీతి చిట్టా కొనసాగించారని చెప్పారు. త్వరలోనే అవినీతి చిట్టా విప్పి జైలులో పెట్టిస్తామని తెలిపారు. అత్యంత పవిత్రమైన తిరుపతి లడ్డు ప్రసాదాన్ని ఆ పవిత్రం చేస్తే కల్తీ చేశారని అగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంపై సుప్రీంకోర్టు సీట్‌ను ఏర్పాటు చేస్తూ ఇచ్చిన తీర్పును అహ్వానిస్తామని అన్నారు. నియోజకవర్గ ప్రజలకు మౌళిక సదుపాయాలు, సీసీ రోడ్లు నిర్మాణాలు, అభివృద్ధి సంక్షేమంపై ఎన్‌డిఏ కూటమి ప్రభుత్వం ముందుకు వెళ్లడం జరుగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు శివప్రసాద్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు వేణుగోపాల్, పట్టణ ప్రధాన కార్యదర్శి అబ్దులాపురం బాష, మైనార్టీ రాష్ట్ర సెల్ నాయకులు పఠాన్ నాగూర్‌ఖాన్, కరివేన గ్రామ నాయకులు శివశంకర్‌శర్మ, నారాయణ, కొండలరావు, రవినాయక్, శరత్, దినకర్‌రావు, ఓబులేసు, వీరారెడ్డి, వెంకటాపురం రాజేంద్రారెడ్డి, కురుకుంద మల్లికార్జున రెడ్డి, గ్రామ సర్పంచ్ మాణిక్యమ్మ, జయన్న, పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల సమస్యలు ఈ ప్రభుత్వానికి పట్టవా..!?



**నంద్యాల, అక్టోబరు 6, ప్రభాతవార్తప్రతినిధి**

రాష్ట్రంలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను ఈప్రభుత్వం గాలికి వదలి వేసిందని మా సమస్యలు ప్రభుత్వాని పట్టావా అంటు ఎపిటిఎఫ్ రాష్ట్ర అద్యక్షకురాలు చెన్నుపాటి మంజుల అన్నారు. అదివారము నంద్యాల పట్టణంలోని ప్రవేటు పిజి కళాశాలలో జిల్లా అద్యక్షురాలు మేకల రామ,ంద్రారెడ్డి ప్రదానకార్యదర్శి శివయ్య అద్యక్షతన జిల్లా ఉద్యమఅద్యయన తరగతులను అమె ప్రారంబించారు. ఈ సందర్భముగా అమె మాట్లాడుతూ రాష్ట్రంలో అదికారము మార్పిడి జరిగి నాల్గు నెలలు కావస్తున్నాయి. ఎన్నకలముందు ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలు ఏ ఒక్కటి ప్రభుత్వం నేరవేర్చక పోవడము బాదకరమని ఇక ఉద్యమించడానికి ఉపాధ్యాయులంతా సిద్దంగా ఉండాలని అమె పిలుపు నిచ్చారు. విద్యారంగ పరిమాణాలు ఉద్యమ చరిత్ర పని విదానము దృక్పథం అనే అంశాలపై అవగామణ కార్యక్రమాలను నిర్వహించారు గత వైసిపి ప్రభుత్వంలో ఐదు సంవత్సరాల కాంలో ఉపాద్యాయులు ఎన్నో మానసిక వేదనలకు గురియ్యారు రివర్సు పిఆర్‌సి ఇచ్చి అర్థికంగా దెబ్బ కొట్టారని కేసలు నమోదు చేశారని అవేదన వ్యక్తం చేశారు. అందుకే ఈ ప్రభుత్వాన్ని కోరని తెచ్చుకున్నాం మా అర్థిక లావాదేవిలను ఇవ్వండి అని డిమాండు చేశారు8. ఉద్యోగ ఉపాద్యాయ పించనర్ల కార్మికులకు 12వ పిఆర్‌సి వెంటనే అమలు చేయాలని డిమాండు చేశారు. మద్యంతర మృతి కింద 30శాతము ప్రకటించాలని కోరారు. ఉపాద్యాయ ఉద్యోగలకు ఐదు డిఏలు ప్రభుత్వం బాకీ పడిందని వాటిని విడుదల చేయాలని 117 జిఓ వల్ల ప్రభుత్వ పాఠశాలలు నిర్వీర్యమయ్యాయని తక్షణమే జివోను రద్దు చేయాలని డిమాండుచేశారు. పాఠశాలల్లో అంగ్ల మాద్యంతో పాటు తెలుగు మాద్యమాన్ని కూడగా కొనసాగించాలని కోరారు. సిపియస్ రద్దు కొరకు ఏపియఫ్ ఉద్యమాన్ని ప్రారంబిస్తుందని ఓపిఎస్‌ను ఒక్కటే ఉద్యోగులు కోరుకుంటున్నారని అన్నారు. ఉద్యోగుల అర్థిక బకాయిలు లక్షల్లో ఉన్నాయని అలాగే విడుదల చేయాలని వారు డిమాండు చేశారు. జిల్లా ప్రదాన కార్యదర్శి కెవిశివయ్య మాట్లాడుతూ జిల్లా విభజన జరిగిన తర్వాత జిలా పరిషత్ పిఎఫ్ సమస్యలు పరిస్కారం కాలేదని ఏ జిల్లా పిఎఫ్ ఖాతాలు అజిల్లాకే బదలాయించాలని వారు డిమాండు చేశారు. ఈ కార్యక్రమంలో జిలా నలుమూలల నుంచి వచ్చిన ఉపాద్యాలు రాష్ట్ర కార్యదర్శి రవికుమారు పూర్వరాష్ట్ర అద్యక్షలు చెంచురెడ్డి ఉమ్మడి కర్నూలు జిల్లా అద్యక్షులు బాలనాగిరెడ్డి రాష్ట్ర కౌన్సిలర్ సుందర్‌రావు, సుకుమాంబ కుమారి, జిల్లా సబ్ కమిటి సభ్యులు దస్తగిరిబాషా, జిసి.తిమ్మరెడ్డి మధు, రమేష్, రాములమ్మ, శైలజ, రమాబాయి, కృష్ణమోహన్ తదగితరులు పాల్గొన్నారు.



## మధ్యలోనే అగిపోయిన అంగన్‌వాడి నిర్మాణ పనులు

**:-రూ.3.5 లక్షలు గోల్‌మాలే కారణమా**
**:-త్వరలోనే పూర్తిచేస్తామంటున్న అధికారులు**

**వగరూరు(మంత్రాలయం), అక్టోబర్ 6, ప్రభాతవార్త:** ఐసిడిఎస్ మంత్రాలయం క్లస్టర్ పరిధిలోని వగరూరు గ్రామంలో నూతన అంగన్‌వాడి భవననిర్మాణ పనులు మధ్యలోనే ఆగిపోయాయి. గ్రామంలో నూతన అంగన్‌వాడి భవన నిర్మాణం కొరకు అప్పటి వైసిపి ప్రభుత్వం రూ.15 లక్షలు మంజూరు చేసింది. నిర్మాణ పనులు ప్రారంభించి సుమారు రెండు సంవత్సరాలు కావస్తున్నా నేటివరకు భవన నిర్మాణం పూర్తికాలేదు. కేవలం స్లాబ్‌లెవెల్ వరకు నిర్మించి అసంపూర్తిగా వదిలేశారు. అయితే కాంట్రాక్టర్‌కు డబ్బులు ఇవ్వకపోవడంతోనే నిర్మాణ పనులు మధ్యలోనే ఆగిపోయినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాంట్రాక్టర్‌కు సుమారు రూ.3.5 లక్షల వరకు డబ్బులు పెండింగ్ ఉండడంతోనే అంగన్‌వాడి భవనం నిర్మాణానికి నోచుకోవడం లేదంటూ గ్రామ ప్రజలు ఆరోపిస్తున్నారు. మాధవరం క్లస్టర్ పరిధిలో మంజూరైన అంగన్‌వాడి భవన నిర్మాణాలు దాదాపు పూర్తి అయినప్పటికీ వగరూరులో మాత్రం అధికారుల నిర్లక్ష్యం కారణంగా అంగన్‌వాడి భవన నిర్మాణ పనులు ఆగిపోయినట్లు తెలిసింది. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి అంగన్‌వాడి భవన నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తిచేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ విషయంపై ఐసిడిఎస్ సూపర్‌వైజర్ నాగలక్ష్మిని ప్రభాతవార్త వివరణ కోరగా కాంట్రాక్టర్‌తో మాట్లాడిత్వరలోనే నిర్మాణ పనులు ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు.



## వర్షాలకు తడిచిన ధాన్యాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే

**- అన్నదాతలను అన్ని విధాలా ఆదుకుంటాం ; ఎమ్మెల్యే**

**గడివేముల, అక్టోబర్06, ప్రభాతవార్త;** మండలంలోని కరిమద్దెల, పెసరవాయి గ్రామాల్లో వర్షాలకు తడిసిన సోయాబిన్, మొక్కజొన్నలను పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి ఆదివారంనాడు పరిశీలించారు. రైతులతో ఆమె మాట్లాడుతూ అధికారులతో మాట్లాడి తగిన న్యాయం చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పంట నష్టం వివరాలను వ్యవసాయశాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. రైతులు ఎవరు కూడా అధైర్యపడొద్దన్నారు. అన్నదాతలను అన్నివిధాలా ఆదుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ దేశం సత్యనారాయణరెడ్డి, గడివేముల మండల వ్యవసాయ అధికారి హేమసుందంరెడ్డి, దేశం రమణారెడ్డి, శివారెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

## సమాజంలో రౌడిషీటర్లు సత్ప్రవర్తన కలిగి ఉండాలి

**: డిఎస్పీ రామాంజి నాయక్**

**: పోలీసు సబ్ డివిజన్ పరిధిలో ప్రతివారానికి ఒక్కసారి కౌన్సిలింగ్**
**: రౌడి యిజం చేసి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే తాటతీస్తాం**

**ఆత్మకూరు, అక్టోబర్06, ప్రభాతవార్త:** సమాజంలో రౌడిషీటర్‌లు సత్ప్రర్తన కలిగి ఉండాలని ఆత్మకూరు డిఎస్పీ రామాంజి నాయక్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక పోలీసు స్టేషన్‌లో రౌడిషీటరులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ నంద్యాల జిల్లా ఎస్పీ ఆదిరాజ్ సింగ్ రానా ఐపిఎస్ ఆదేశాల మేరకు ప్రతి వారానికి ఒక్కసారి డివిజన్ పరిధిలో రౌడిషీటరులకు కౌన్సిలింగ్ నిర్వహించే విదంగా ప్రత్యేక చొరవ తీసుకున్నామన్నారు. రౌడియిజం చేస్తూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే తాట తీయక తప్పదని ఘాట్‌గా హెచ్చరించారు. సమాజ హీతం కోసం శాంతి భద్రతాలకు విఘాతం కలిగించకుండా ఉండాలని తెలిపారు. హద్దులు మీరి చట్టాని చేతులోకి తీసుకోని ఆసాంఘిక శక్తులకు పాల్పిడితే పట్టణ బహిస్కరణ చేసే విదంగా సిపారసు చేస్తామని తెలిపారు. సమాజంలో అందరితో కలసి మెలసి సోదరబావంతో ముందుకు వెళ్లి సత్ప్రవర్తనతో మెలగాలని వివరించారు. మేము రౌడిలం కదా మాకు ఎవరు అడ్డు రారు అని అనుకుంటే పోలీసుశాఖ పవర్ చూపించక తప్పదని తెలియజేశారు. ఈ సమావేశంలో ఆత్మకూరు ఎస్ఐ డివి.నారాయణరెడ్డి, పోలీసు సిబ్బంది, పాల్గొన్నారు.



# దసరా సెలవులకు ఊరు వెళ్లితే జాగ్రత్త - సీఐ రమేష్‌బాబు

**కొలిమిగుండ్ల, అక్టోబర్6, ప్రభాతవార్త:** కొలిమిగుండ్ల మండల ప్రజలకు సీఐ రమేష్‌బాబు దొంగల నివారణ చర్యల్లో భాగంగా కొలిమిగుండ్ల మండల ప్రజలకు సూచనలు, సలహాలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దసరా సెలవులకు ఇతర ఊర్లకు వెళ్లే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ రమేష్‌బాబు తెలిపారు. ముఖ్యంగా ఇళ్లకు తాళాలు వేసి వెలుతున్నవారు అత్యంత విలువైన వస్తువులు, బంగారు ఆభరణాలను ఇంట్లో ఉంచరాదని సూచించారు. ఇళ్ల పై నిఘా ఉండే విధంగా జాగ్రత్త వహించాలని ఇంటిలో లైట్లు వెలిగే విధంగా ఉంచుకోవాలని సూచించారు. అవసరమైతే సొంతంగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకుంటే మరింత భద్రంగా ఉంటుందని సీఐ తెలిపారు. ప్రజలు ఊళ్లకు వెళ్లినప్పుడు మీ ఇంటి పక్కన వారిని మా ఇంటిని పరిశీలిస్తుండాలని చెప్పి వెళ్లాలని ఒకవేళ మీరు ఊరికి వెళితే పోలీస్‌స్టేషన్‌లో తెలియజేస్తే రాత్రిళ్లు డ్యూటీ చేసే పోలీసులు ఆ ఇంటి పై నిఘా ఉంచుతామని సీఐ తెలియజేశారు.

